
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



నంద్యాల 5
జిల్లా వార్తలు
మంగళవారం 9 డిసెంబరు 2025

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపర్ పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.

కర్నూలు, డోన్, ఆత్మకూరు, కల్లూరు	- 99854 09260
కర్నూలు, కోడుమూరు, నందికొట్కూరు	- 9985411379
ఆదోని, ఆలూరు, పత్తికొండ, ఎమ్మిగనూరు	- 9985171793
నంద్యాల, పాణ్యం, ఆళ్ళగడ్డ, బనగానపల్లె	- 9985411377

అర్జీల పరిష్కారంపై దృష్టి పెట్టండి: కలెక్టర్



సమస్యలు వింటున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల నూనెపల్లి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రజా పరిష్కార వేదికకు వచ్చే అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ రాజకుమారి అధికారులకు సూచించారు. పట్టణంలోని కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. రీఓపెన్ అయిన 592 దరఖాస్తులను ఒక వారం రోజుల్లో పూర్తిస్థాయిలో క్లియర్ చేయాలని ఆదేశించారు. అలాగే ఎస్ఎల్ఏలో ఉన్న 1,797 దరఖాస్తులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పెండింగ్ అర్జీల ఆడిట్‌ను నిరంతర ప్రక్రియగా తీసుకోవాలని, ప్రతి దరఖాస్తు ప్రగతి దశను అధికారులు స్వయంగా పర్యవేక్షించి ఆలస్యానికి తావు లేకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్వో రామునాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగులు నైపుణ్యాలను పెంచుకోవాలి: కలెక్టర్

ప్రభుత్వ ఉద్యోగుల నైపుణ్యాలు పెంచేందుకు ఐగాట్ కర్మయోగి యాప్ ముఖ్య భూమిక పోషిస్తోందని, ఉద్యోగులు నైపుణ్యాలను పెంచుకోవాలని కలెక్టర్ రాజకుమారి సూచించారు. పట్టణంలోని కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ భవనంలో సోమవారం ప్రజా అర్జీల స్వీకరణ అనంతరం పలు శాఖల అధికారులతో ఆమె నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు అవసరమైన ప్రవర్తన నియమాలు, సీసీఏ రూల్స్ వంటి కోర్సులు ఈ యాప్ ద్వారా వీడియో రూపంలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వీడియో చూసిన తర్వాత వచ్చే ప్రశ్నావళికి సమాధానాలు ఇస్తే ఉద్యోగి పేరుతో సర్టిఫికెట్ జారీ అవుతుందన్నారు. రానున్న రోజుల్లో ఈ యాప్‌లలో ఉద్యోగుల పురోగతిని సీఎఫ్ఎంఎస్ ఐడీలకు అనుసంధానం చేయడంతో పాటు, వార్షిక ఇంక్రిమెంట్ల మంజూరుపై కూడా ఇది ప్రభావం చూపవచ్చని తెలిపారు. ఇప్పటికే పంచాయతీరాజ్ ఈఈ, ఎక్సైజ్ సూపరింటెండెంట్, డీఈవో అత్యధిక కోర్సులు పూర్తి చేయడం ద్వారా మంచి ప్రదర్శన కనబర్చారని అభినందనలు తెలిపారు. సమావేశంలో డీఆర్వో రామునాయక్ తదితరులు పాల్గొన్నారు.



తెలుగు గంగ ప్రధాన కాల్వ

ఆరుతడి సరే వరికి నీరివ్వరా?

- ఖరీఫ్‌లో ప్రకృతి దాడితో తీవ్ర నష్టం
- రబీలో ఆదుకోవాలని టీజీ ప్రధాన కాల్వ ఆయకట్టు రైతుల విన్నపం
- ప్రాజెక్టుల్లో నీరున్నా అధికారుల నిర్లక్ష్యం
- 2026 మార్చి 31 వరకు సాగు నీరందిస్తాం
- తెలుగుగంగ ప్రాజెక్టు ఇన్‌చార్జి ఎస్ఈ ప్రతాప్



ఆయకట్టు భూముల్లో సాగుచేసిన వరి నారు

రుద్రవరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రైతుకు అడుగడుగునా కష్టాలే. 2025 ఖరీఫ్ సీజన్‌లో ప్రకృతి దాడిలో రైతులు తీవ్రంగా నష్టపోయారు. మొంథా, దిత్వా తుఫానులతో చేతికందిన పంటలు వరి, మొక్కజొన్న, మినుము, వేరుశనగ తదితర పంటలు కోల్పోయారు. వర్షాల వల్ల తెగుళ్లు సోకి దిగుబడి గణనీయంగా తగ్గింది. అయితే రబీలో ఆరుతడికి మాత్రమే నీరు ఇస్తామని అధికారులు అంటున్నారు. ఖరీఫ్ కష్టం నుంచి బయటపడాలంటే వరికి కూడా నీరు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

జిల్లాలో 1,14,500 ఎకరాల్లో తెలుగుగంగ ఆయకట్టు భూములున్నాయి. 39 బ్లాక్ చానెళ్లు ఉన్నాయి. తెలుగుగంగ ప్రధాన కాల్వ నల్లమల ప్రాంతంలోని రైతులకు వరప్రసాదిని. మెట్ట భూములకు సాగునీరందించి రైతులను ఆదుకుంటుంది. ఈసారి ప్రకృతి ప్రకోపంతో రైతులు పంటల దిగుబడి తగ్గిపోయి తీవ్రంగా నష్టపోయారు.

రబీలో తెలుగు గంగ సాగు నీరందించి ఆదుకోండి

రుద్రవరం, చాగలమర్రి, శిరివెళ్ల, గోస్పాడు, ఆళ్లగడ్డ, మహానంది, బండి ఆత్మకూరు, వెలుగోడు, నంద్యాల మండలాల్లో తెలుగుగంగ కాల్వ ప్రవహిస్తుంది. ఈ భూములకు గంగ నీరే ఆధారం. ఈ ఖరీఫ్‌లో నష్టపోయామని, రబీలో ఆరుతడి పంటలకేగాక వరికి కూడా నీరు ఇచ్చి ఆదుకోవాలని, ప్రజాప్రతినిధులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు. ఇటీవల నిర్వహించిన ఐఏబీ సమావేశంలో ఆరుతడి పంటలకే సాగునీరు అందిస్తామని అధికారులు, ప్రజాప్రతినిధులు చెప్పడంతో తెలుగుగంగ ఆయకట్టు రైతాంగం ఖంగుతిన్నారు.



రుద్రవరం సమీపంలో ఎద్దులతో మొక్కజొన్న విత్తనం వేస్తున్న రైతులు

ఆరుతడి పంటల సాగుకు యోగ్యం కాని భూముల మాటేమిటి?

ఆరుతడి పంటలు సాగు చేసుకొనేందుకు యోగ్యం కాని భూముల మాటేంటని రైతులు, కౌలు రైతులు అధికారులను, ప్రజాప్రతినిధులను ప్రశ్నిస్తున్నారు. వరి తప్ప మిగిలిన పంటలు సాగు చేసుకోవడానికి కూడా వీలు లేని భూములు ఉన్నాయి. వాటిలో ఏ పంట సాగు చేయాలో అధికారులే చెప్పాలని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఆరుతడి పంటలు సాగు చేసేందుకు కూడా వీలు కాని పంటలను ఎలా సాగు చేయాలని ప్రశ్నిస్తున్నారు.

ప్రాజెక్టుల్లో నీరున్నా..:

వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయరు సామర్థ్యం 16.95 టీఎంసీలు. 2025 డిసెంబరు 7వతేదీ నాటికి 16.68 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు రికార్డులు చెబుతున్నాయి. శ్రీశైలం ప్రాజెక్టులో నీరు పుష్కలంగా ఉంది. ప్రాజెక్టుల్లో నీరున్నా అధికారుల్లో నిర్లక్ష్యం రైతులకు శాపం కానుందా..? రైతులను ఆదుకోవాల్సిన అధికారులే నిర్లక్ష్యం చేయడమేమిటి? ఇలాంటి ఎన్నో ప్రశ్నలు రైతులు సంధిస్తున్నారు.



తెలుగు గంగ ఆయకట్టు భూములు

కౌలు రైతుకు తీవ్ర నష్టం

జిల్లాలో కౌలు రైతులు సుమారు 80 శాతం మంది ఉండగా 20 శాతం మంది రైతులు మాత్రమే సొంతంగా భూములు సాగు చేస్తున్నారు. కౌలు, పంటల సాగుకు పెట్టిన పెట్టుబడి కలిసి కౌలు రైతులకు తడిసి మోపెడైంది. కౌలు కూడా చెల్లించలేని పరిస్థితుల్లో రైతులు ఉన్నారు. కౌలు రైతులే అధిక సంఖ్యలో ఉండడం గమనార్హం. కౌలు రైతులను సాగునీరు అందించి ఆదుకోవాలని విన్నవించుకుంటున్నారు.

మిగతా 8వ పేజీలో

అరటి రైతు కుదేలు

- తోటలను దున్నేస్తున్న రైతులు

చాగలమర్రి, డిసెంబరురు 8(ఆంధ్రజ్యోతి): అరటికి ధర లేక రైతులు కుదేలయ్యారు. పెట్టుబడి కూడా రాక తీవ్రంగా నష్టపోతున్నారు. చాగలమర్రి మండలంలోని చిన్నవంగలి గ్రామంలో సోమవారం రైతు సంజీవరాయుడు 2ఎకరాలు అరటి తోటను ట్రాక్టర్‌తో దున్నేశాడు. ఎకరాకు రూ.లక్ష దాకా వ్యయం చేశామని, ధర లేక అరటి గెలలు కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ముందుకు రావడం లేదని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. అరటి గెలలు చెట్లకే మాగి పోయి నష్టపోవాల్సి వచ్చిందని రైతు విలపించారు. అరటి గెలలతో ఉన్న తోటను వదిలేశారు. దీంతో గొర్రెల కాపరులు మేత కోసం ట్రాక్టర్లలో అరటి గెలలను తరలించుకున్నారు. అరటి గెలలు వచ్చేసరికి టన్ను రూ.2 వేలు నుంచి రూ.5 వేలకు పడిపోయిందని, ఆ ధరకు కూడా కొనుగోలు చేసేందుకు వ్యాపారులు రావడం లేదని అన్నారు. ఒక్కసారిగా ధర లేక నష్టపోవాల్సి వచ్చిందని, పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి కనిపించక పోవడంతో ప్రత్యామ్నాయ పంట సాగు చేసేందుకు తొలగిస్తున్నామని అన్నారు. అధిక వర్షాలు, వైరస్ వల్ల తోటలు దెబ్బతిన్నాయి. ప్రభుత్వం స్పందించి పరిహారం అందించి ఆదుకోవాలని రైతు కోరారు.



చిన్నవంగలిలో అరటి పంటను దున్నేస్తున్న రైతు

శ్రీశైలంలో భక్తుల రద్దీ

- అందరికీ అలంకార దర్శనాలు మాత్రమే
- ఈవో శ్రీనివాసరావు

శ్రీశైలం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైల మల్లన్నను దర్శించుకునేందుకు వస్తున్న యాత్రికులతో క్షేత్రమంతా రద్దీగా మారింది. వారాంతపు సెలవులు పూర్తయినప్పటికీ గర్భాలయ స్పర్శ దర్శనం కోసం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు క్షేత్రానికి చేరుకుంటూనే ఉన్నారు. సోమవారం తెల్లవారుజామున తలనీలాలు సమర్పించుకుని కృష్ణమ్మ ఒడిలో నదీ స్నానాలు చేసి పసుపు కుంకుమలు గంగమ్మకు సారెలు సమర్పించుకున్నారు. భక్తులందరికీ అలంకార దర్శనమే ఉన్నందున వీఐపీ టికెట్లు పొందిన వారికి గంట సమయం, అతి శీఘ్ర దర్శనం వారికి రెండు గంటలు, శీఘ్ర, ఉచిత దర్శనం వారికి కూడా రెండు గంటలకు పైగా ఉభయ దేవాలయాలలో దర్శనాలు ముగిశాయని ఆలయ అధికారులు చెప్పారు. అదేవిధంగా 500, 300 టిక్కెట్లు పొందిన భక్తుల ఉచిత లడ్డూ ప్రసాదాన్ని పొందనున్నట్లు చెప్పారు. సాయంత్రం కళారాధన వేదికపై కడప తాళ్లపాక అన్నమయ్య జిల్లాకు చెందిన బాలరాజు, పాండురంగ రాజుల బృందం భజనలు చేసింది. హైదరాబాద్‌కు చెందిన కూచిపూడి కళాక్షేత్రం వారి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.



కంపార్టుమెంట్లో వేచి ఉన్న భక్తులు

ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు: ఎస్పీ



ఫిర్యాదు దారులతో మాట్లాడు తున్న ఎస్పీ

నంద్యాల టౌన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దని ఎస్పీ సునీల్ షెరాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి 95 ఫిర్యాదులు స్వీకరించారు. ఎస్పీ మాట్లాడుతూ ఫిర్యాదులపై పూర్తిస్థాయి విచారణ చేసి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. నిర్ణీత గడువులోగా సమస్యలను పరిష్కరించి ఫిర్యాదులు పునరావృత్తం కాకుండా చూసుకోవాలని ఎస్పీ సూచించారు. కార్యక్రమంలో పోలీసు ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

టెట్‌కు ఏర్పాట్లు పూర్తి: డీఈవో

నంద్యాల ఎడ్యుకేషన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ నెల 10వ తేదీ నుంచి 21వ తేదీ వరకు నిర్వహించే టెట్‌కు నాలుగు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు డీఈవో జనార్దన్‌రెడ్డి తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండో సెషన్ పరీక్ష ఉంటుందని తెలిపారు. పాణ్యం మండలం నెరవాడ సమీపంలోని శాంతిరామ్ ఇంజనీరింగ్ కళాశాల, ఆర్‌జీఎం ఇంజనీరింగ్ కళాశాల, నంద్యాల పట్టణంలోని శ్రీరామకృష్ణా డిగ్రీ కళాశాల, ఎస్‌బీఐ కాలనీలోని శ్రీ రామకృష్ణా పీజీ కళాశాలలో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 8,791 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు అవుతారని చెప్పారు. ఆన్‌లైన్ విధానంలో జరుగుతున్న ఈ పరీక్షలకు అభ్యర్థులు అరగంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు. ఏవైనా సందేహాలుంటే డీఈవో కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

అంకిత భావంతో పని చేయాలి
ఎఫ్‌డీ విజయ్‌కుమార్

శ్రీశైలం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వన్యప్రాణి సంరక్షణకు అంకిత భావంతో పనిచేసిన సిబ్బందిని అభినందిస్తూ అవార్డు, నగదు బహుమతులను అందించినట్లు అటవీశాఖ నంద్యాల, ప్రకాశం జిల్లా ఎఫ్‌డీ విజయ్‌కుమార్ చెప్పారు. గిద్దలూరు ప్రాజెక్టు టైగర్ డివిజన్‌లోని గుండ్లకమ్మ రెంజ్ దిగువమిట్టలో పీసీసీఎఫ్ అండ్ హెచ్ఓఎఫ్ఎఫ్, పీసీసీఎఫ్(డబ్ల్యూఎల్) చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ పీవీ చలపతిరావు చేతుల మీదుగా ఐఎఫ్ఎస్ ద్వారా అడవులు, వన్యప్రాణి రక్షణలో కీలక పాత్ర వహించిన ఎన్ఎస్‌టీఆర్ ప్రొటెక్షన్ వాచర్లకు డబ్ల్యూడబ్ల్యూఎఫ్ సర్టిఫికెట్ అవార్డులు, 5000 నగదు బహుమతులు అందించినట్లు చెప్పారు. అవార్డులు పొందిన వారిలో హనుమౌహ్, పిచ్చయ్య, జనార్దన్ నాయక్, నాగయ్య, ఈదన్న ఉన్నారు.



అసంపూర్తిగా జలాశయం

ఎందుకీ వివక్ష..

- అసంపూర్తిగా పందికోన జలాశయం, కుడి, ఎడమ కాలువ
- రూ.210 కోట్లు ఇస్తే 45 వేల ఎకరాలకు సాగునీరు
- ప్రతిపాదనల ఫైలు వెనక్కి

కర్నూలు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన పందికోన జలాశయం, కుడి ఎడమ కాలువలపై పదేళ్ల నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారింది. అసంపూర్తి పనులు పూర్తి చేస్తే 45 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. అది సాకారం కావాలంటే రూ.210 కోట్లు ఇవ్వాలి. ఇంజనీర్లు ప్రతిపాదనలు పంపారు. నిధులు ఇవ్వకపోగా రిజర్వాయరుకు, కాలువలకు వేర్వేరుగా రెండు ప్రతిపాదనలు పంపాలని ఉచిత సలహా ఇచ్చి ఫైలును వెనక్కి పంపినట్లు సమాచారం. అదే అనంతపురం జిల్లాలో హంద్రీ నీవా ప్రాజెక్టుకు అనుబంధంగా చేపట్టిన ఐదు ప్రాజెక్టులకు రూ.2,310 కోట్లు మంజూరు చేయడం అభినందనీయమే. కరువు, వలసలతో తల్లడిల్లే కర్నూలు జిల్లాపై ఎందుకీ వివక్ష చూపడంపై విమర్శలు వెల్లువెత్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా ఎంపీ, ఎమ్మెల్యేలు మేల్కొనాలి.. సీఎం చంద్రబాబు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అయినా జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుపై ఒత్తిడి తెచ్చి నిధులు మంజూరు చేయించాలని రైతులు కోరుతున్నారు. నిధులిస్తే ఈ వేసవిలో పనులు చేసేందుకు అవకాశం ఉంది. ఇందుకు విరుద్ధంగా ప్రతిపాదనలతో కాలయాపన చేయడం పలు విమర్శలకు తావిస్తోంది.

హంద్రీనీవా సుజల స్రవంతి ఎత్తిపోతల పథకం ద్వారా ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 8 టీఎంసీలు వాడుకొని నందికొట్కూరు, పాణ్యం, పత్తికొండ, ఆలూరు నియోజకవర్గాల్లో 80 వేల ఎకరాలకు సాగునీరు ఇవ్వాలన్నది లక్ష్యం. 0.16 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన కృష్ణగిరి జలాశయం కింద 5.100 ఎకరాలు, 1.126 టీఎంసీల సామర్థ్యంతో పత్తికొండ (పందికోన) జలాశయం కుడి కాలువ కింద 10,774 ఎకరాలకు, ఎడమ కాలువ కింద 50,626 ఎకరాలు కలిపి 61,400 ఎకరాలకు సాగునీరు ఇవ్వాల్సి ఉంది. పూర్తిస్థాయిలో నీళ్లు ఇస్తే పత్తికొండ, దేవనకొండ, ఆస్పరి మండలాలు పచ్చని పైర్లతో సస్యశామలమవుతాయి. కరువు, వలసలు నివారించే అవకాశం ఉంది. అయితే జలాశయం, కుడి, ఎడమ ప్రధాన కాలువలు, పంట కాలువలు అసంపూర్తిగా వదిలేశారు. ఫలితంగా 16-18 వేల ఎకరాలకు కూడా సాగునీరు అందని దైన్యపరిస్థితి ఉంది. ఏళ్లు గడిచిపోతున్నాయి.. ప్రభుత్వాలు మారుతున్నాయే తప్పా అసంపూర్తి పనులపై పాలకులు దృష్టి సారించడం లేదు. ప్రజాప్రతినిధులు కూడా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి నిధులు రాబట్టడంలో ఘోరంగా విఫలం అవుతున్నారు. ఫలితంగా కళ్ల ముందే కృష్ణా జలాలు తరలిపోతున్నా కరువు రైతులకు కన్నీళ్లు తప్పడం లేదు.

విడివిడిగా ప్రతిపాదనలు పంపండి..!

వైసీపీ హయాంలో రెండు మూడు పర్యాయాలు ప్రతిపాదనలు పంపినా నాటి జగన్ ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని రూ.3,500 కోట్లతో రికార్డు స్థాయిలో హంద్రీనీవా ప్రధాన కాలువ విస్తరణ పనులు పూర్తి చేశారు. పదేళ్లకు పైగా అసంపూర్తిగా వదిలేసిన పందికోన జలాశయం, కుడి, ఎడమ కాలువలు, పంట కాలువలు పూర్తి చేస్తే 45 వేల ఎకరాలకు సాగునీరు ఇవ్వవచ్చని హంద్రీనీవా కాల్వ విస్తరణ పనులు క్షేత్రస్థాయిలో పరిశీలించడానికి పత్తికొండకు వచ్చిన జిల్లా ఇన్‌చార్జి, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి రైతులు, ఇంజనీర్లు తీసుకువెళ్లారు. తక్షణమే ప్రతిపాదనలు తయారు చేయమని ఆదేశించారు.

మిగతా 6వ పేజీలో



కప్పట్రాళ్ల సమీపంలో పత్తికొండ జలాశయం కుడి కాలువ దుస్థితి

బాలల సంక్షేమమే లక్ష్యం

రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బాలల సంక్షేమం, విద్యా ప్రమాణాల మెరుగుదలకు ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం పెద్దపాడులోని దామోదరం సంజీవయ్య బాలసదనాన్ని ఆమె సందర్శించారు. చిన్నారులు, వసతి గృహాల వార్డెన్లు చైర్‌పర్సన్‌కు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బాల్య వివాహాల నివారణ అంశంపై విద్యార్థులు ప్రదర్శించిన నాటికను చైర్‌పర్సన్ శైలజ వీక్షించారు. వసతి గృహంలోని డైనింగ్ హాలు, వంటగది, స్టోర్ రూం విద్యార్థుల పడక గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలసదనంలో విద్యతో పాటు బాలల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతోందన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌ల గురించి అవగాహన కల్పిస్తూ పిల్లలు బయటి ప్రపంచంలో ఎలా మెలగాలో అత్యవసర పరిస్థితుల్లో ఎలా ఎదుర్కోవాలన్న అంశంపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని పిల్లలు బాగా చదువుకోవాలన్నారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ బాలసదనంలో 48 మంది పిల్లలు ఉన్నారనీ, వీరికి మెరుగైన వసతులు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. వీటిని కల్పించేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. బాల్యవివాహాలు చేయకూడదని తల్లిదండ్రులకు, పిల్లలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం నగరంలోని బీ.క్యాంపులో ఉన్న బీసీ బాలిక సంక్షేమ వసతి గృహాన్ని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ రీజనల్ డైరెక్టర్ రోహిణి, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి.విజయ పాల్గొన్నారు.



విద్యార్థులతో డా.రాయపాటి శైలజ, గౌరు చరిత

ఓపీకతో ఉండాల్సిందే..!

● కర్నూలు జీజీహెచ్‌లో రోగుల రద్దీ


గైనిక్ ఓపీ వద్ద అవస్థలు పడుతున్న గర్భిణులు



ఓపీ కౌంటర్ల వద్ద బారులుదీరిన రోగులు

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఓపీ రోగులతో కిటకిటలాడింది. సోమవారం కావడంతో ఉదయం 10:30 గంటలకు ఓపీ కోసం వచ్చిన రోగులు రద్దీ పెరగడంతో పక్కన ఉన్న సీసీ రోడ్డుపైకి ఎక్కి క్యూలైన్లలో నిలబడ్డారు. సీజనల్ వ్యాధులు, చలి తీవ్రత పెరగడంతో సోమవారం రోజు వివిధ జబ్బులతో బాధపడుతూ ఆసుపత్రికి వచ్చారు. ఓపీ చీటి తీసుకునేందుకు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. ఓపీ రాసే సిబ్బంది ఆయుష్మాన్ భారత్ యాప్‌లో రోగి వివరాలు నమోదు చేసే వరకు ఓపికగా వేచి ఉండి తర్వాత ఓపీ కౌంటర్ల దగ్గరకు వెళ్లాల్సి వస్తోంది. సాధారణంగా ఓపీ కౌంటర్ల దగ్గర ఉదయం 10:30 గంటల నుంచి 11 గంటల వరకు విపరీతమైన రద్దీ ఉంటుంది. కానీ ఇటీవల చలి తీవ్రత పెరగడంతో ఓపీ రోగులు ఆలస్యంగా వస్తున్నారు. సోమవారం కూడా ఉదయం 11 గంటలకు రద్దీగా పెరిగి క్యూలైన్ సీసీ రోడ్డు వరకు కొనసాగింది. ఆసుపత్రిలో 12 ఓపీ కౌంటర్లు ఉండగా.. ఇందులో 6 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లు పని చేస్తుండగా.. దీనికి సంబంధం లేని స్టాఫ్ నర్సులు ఓపీ కౌంటర్ల వద్ద పని చేస్తున్నారు. డేటా ఎంట్రీ ఆపరేటర్లు ఓపీ చీటీలను త్వరగా ఇస్తున్న స్టాఫ్ నర్సులు కొంత ఆలస్యంగా ఇస్తున్నారు. అధికారులు కొత్తగా ఆలస్యంగా ఇస్తున్నారు. అధికారులు కొత్తగా డేటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించి ఓపీ దగ్గర రద్దీని నివారించాలని రోగులు కోరుతున్నారు.


ఓపీ కేంద్రాల వద్ద క్యూలైన్లలో నిలిచివున్న మహిళలు

రాష్ట్ర క్రికెట్ జట్టులో కౌసల్యబాయికి చోటు

అండర్-19 విభాగంలో ఎంపికైన ఎల్.తండా యువతి



వెల్దుర్తి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ క్రికెట్ రాష్ట్ర జట్టు అండర్-19కు వెల్దుర్తి మండలం ఎల్. తండా గ్రామానికి చెందిన సుగాలి వర్మ్య కౌసల్యబాయి ఎంపికైంది. 13వ తేదీ నుంచి 21 తేదీల్లో అండర్-19 మహిళా విభాగంలో ముంబైలో జరగనున్న దేశవాళీ వన్డే మ్యాచ్‌లలో ఆడనున్నట్లు కోచ్‌లు శ్రీనివాసులు, శేఖర్ తెలిపారు. జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గోవిందరెడ్డి, సెక్రటరీ దేవేంద్రగౌడు, అడ్మినిస్ట్రేషన్ మేనేజర్ రమేశ్‌బాబు శుభాకాంక్షలు తెలియజేశారు. తల్లిదండ్రులు సూర్యనాయక్, కాలెనాయక్, సోదరుడు డాక్టర్ శేఖర్‌నాయక్ సంతోషం వ్యక్తం చేశారు. స్వగ్రామమైన ఎల్.తండాలో గ్రామస్థులు బాణసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. దేశవాళీ మ్యాచ్‌లలో అత్యుత్తమ ప్రతిభ కనబరచి భారత జట్టుకు ఎంపిక కావాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

లక్ష్మీనరసింహ స్వామి విగ్రహం సమర్పణ


లక్ష్మీనరసింహ స్వామి విగ్రహాన్ని అందిస్తున్న దాత

ఆళ్లగడ్డ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం అహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రధాన అర్చకులు కీడాంబి వేణుగోపాల్ స్వామికి అహోబలం మూవీ ప్రొడ్యూసర్ శెట్టి విజయ్‌కుమార్ లక్ష్మీనరసింహ స్వామి పంచలోహ విగ్రహాన్ని సోమవారం సమర్పించారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ లక్ష్మీనరసింహస్వామి ఆశీస్సులతో అహోబలం పేరుతో సినిమా తీస్తున్నట్లు తెలిపారు.

ముగిసిన వన్యప్రాణుల గణన

రేంజర్ ముర్తుజావలి


రుద్రవరం ఫారెస్టు రేంజ్ పరిధిలో వన్యప్రాణుల ట్రాన్సిట్ లైన్‌ను పరిశీలిస్తున్న రేంజర్ ముర్తుజావలి

రుద్రవరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రుద్రవరం ఫారెస్టు రేంజ్ పరిధిలో డిసెంబరు 1 నుంచి 8వతేదీ వరకు ట్రైల్ పాథ్ (మాంసాహార జంతువులు) ట్రాన్సిట్ లైన్ (శాకాహార జంతువులు)లను గణాంకాలు సోమవారంతో ముగించినట్లు రేంజర్ ముర్తుజావలి తెలిపారు. ట్రైల్‌పాథ్ 12 బీట్‌లలో 210 కి.మీ, ట్రాన్సిట్ లైన్ 14 బీట్‌లలో 84 కిమీ పూర్తి చేశామన్నారు. ట్రైల్ పాథ్ పరిధిలో పెంటికలు, పాదముద్రలు చెట్లను గీకిన గుర్తులను సేకరించామన్నారు. ట్రాన్సిట్ లైన్ శాఖాహార జంతువులను గుర్తించేందుకు ప్రతి బీట్ పరిధిలో మూడురోజుల నుంచి రెండు కిమీ చొప్పున కాలిబాటలు నడిచి పరిశీలించామన్నారు. వీటి పరిధిలో దుప్పి, అడవి పంది, కొండ గొర్రె, కణితి వంటి శాఖాహార జంతువుల పెంటికలను అటవీ సిబ్బంది నమోదు చేశారు. ట్రైల్‌పాథ్‌లో పెద్ద పులి, చిరుత, ఎలుగువంటి, రేసు కుక్క అడవి పిల్లి వంటి వాటి పెంటికలు పాదముద్రలు సేకరించామన్నారు. అలాగే అటవీ ప్రాంత సహజ ఆవాసంలో అంచనా వేయడానికి వృక్ష సంపదను, గట్టి ఔషధమొక్కను యాప్‌లో నమోదు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌చార్జి రేంజర్ ముక్తర్‌బాషా, సెక్షన్ ఆఫీసర్లు శ్రీనివాసరెడ్డి, రామక్రిష్ణ, బీట్ ఆఫీసర్లు సురేంద్రగౌడ్, నాగభూషణయ్య, జేమ్స్‌పాల్ పాల్గొన్నారు.

రేపు జాబ్ మేళా

కర్నూలు అర్బన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): నగరంలోని క్లస్టర్ వర్సిటీలో బుధవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ జి.శ్రీనివాస్ తెలిపారు. త్రోప్స్ టెక్ కెరీర్ సొల్యూషన్స్ కంపెనీ నిర్వహించే ఇంటర్వ్యూల్లో గ్రాడ్యుయేట్ ఇంజనీర్ ట్రైనీ పోస్టులకు ఎంపిక చేస్తారని తెలిపారు. 2024-25 బీఎస్సీ కంప్యూటర్ సైన్సు పూర్తి చేసిన, 2026లో పాసౌట్ అయ్యే విద్యార్థులు అర్హులు అని తెలిపారు.

ఎందుకీ వివక్ష..

(5వ పేజీ తరువాయి)

రిజర్వాయరు అసంపూర్తి పనులకు రూ.60 కోట్లు, కాలువల అసంపూర్తి పనులకు రూ.150 కోట్లు చొప్పున రూ.210 కోట్లు ఇస్తే అదనంగా 45 వేల ఎకరాలు సాగులోకి వస్తుందని ప్రతిపాదనలు పంపించారు. నిధులు ఇవ్వకపోగా జలాశయానికి, కాలువలకు వేరువేరుగా రెండు ప్రతిపాదనలు తయారు చేసి పంపమని ఉచిత సలహా ఇస్తూ జలవనరుల శాఖ నుంచి ఫైలు వెనక్కి పడేశారు. నిధులు ఇవ్వకుండా కాలయాపన చేసేందుకే విడివిడిగా రెండు ప్రతిపాదనలు అంటూ మాయ చేస్తున్నట్లు అర్థమవుతోంది.


కరివేముల వద్ద రోడ్డు క్రాసింగ్ బ్రిడ్జి నిర్మించకపోవడంతో అడ్డంగా పైపులు వేసి నీటి మళ్లింపు

సరిహద్దు జిల్లాకు రూ.2,310 కోట్లు

సరిహద్దు ఉమ్మడి అనంతపురం జిల్లాలో హంద్రీనీవా ప్రాజెక్టుకు అనుబంధంగా ఉన్నా, 195 చెరువులకు హంద్రీనీవా జలాలు ఎత్తిపోసే ప్రాజెక్టుకు రూ.200 కోట్లు, రెండు టీఎంసీల సామర్థ్యంలో విస్తరించే జీడిపల్లి బండ జలాశయానికి రూ.650 కోట్లు, జీడిపల్లి రిజర్వాయర్ నుంచి రెండు టీఎంసీలు ఎత్తిపోసే అప్పర్ పెన్నార్ ప్రాజెక్టుకు రూ.900 కోట్లు, జీడిపల్లి రిజర్వాయన్ నుంచి బైరవానితిప్ప(బీటీపీ) జలాశయానికి రెండు టీఎంసీలు ఎత్తిపోతల పథకానికి రూ.560 కోట్లు చొప్పున ఐదు ప్రాజెక్టులకు రూ.2,310 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. ఆ జిల్లా ప్రజాప్రతినిధులు పార్టీలకు అతీతంగా జిల్లా అభివృద్ధిని కాంక్షిస్తూ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి నిధులు మంజూరు చేయించుకున్నారు. కానీ ఆ స్ఫూర్తి కర్నూలు జిల్లా ప్రతిప్రతినిధుల్లో లోపించినట్లు స్పష్టంగా తెలుస్తోంది. 45 వేల ఎకరాలను సాగులోకి తీసుకొచ్చే పందికోన జలాశయం, కాలువల అసంపూర్తి పనులకు నిధులు ఇవ్వకపోవడం జిల్లాపై పాలకుల వివక్షే కరణమా..? జిల్లా ప్రజా ప్రతినిధుల వైఫల్యమా..? అన్న ప్రశ్నలు తలెత్తున్నాయి. జిల్లాకు చెందిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు స్పందించి నిధులు రాబట్టేందుకు సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నేతలు ఇలాగే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని రాయలసీమ సాగునీటి నిపుణులు పేర్కొంటున్నారు.

> **విడి విడిగా ప్రతిపాదనలు పంపమన్నారు**
>
> హంద్రీనీవా ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన పందికోన జలాశయం, ఆ రిజర్వాయర్ కుడి, ఎడమ పంట కాలువల అసంపూర్తి పనులు పూర్తి చేస్తే 45 వేల ఎకరాలకు సాగునీరు ఇవ్వవచ్చు. ఆ పనుల కోసం రూ.210 కోట్లు నిధులు అవసరం ఉందని ప్రతిపాదనలు తయారు చేశాం. ఒకే ప్రతిపాదన వద్దని రిజర్వాయరు, కాలువలకు విడివిడిగా రెండు ప్రతిపాదనలు తయారు చేయాలని ఉన్నతాధికారులు సూచించారు. ఆ మేరకు మళ్లీ ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపుతాం.
>
> - నాగరాజు, సీఈ, హంద్రీ నీవా ప్రాజెక్టు, అనంతపురం



పొద్దెక్కినా వదలని చలి



రుద్రవరం మండంలోని కొండమాయపల్లెకు వెళ్లే దారిలో మంచు దుప్పటి



గోనెగండ్ల రోడ్లను కప్పేసిన మంచు



కొలిమిగుండ్ల: సూర్య కిరణాలు ప్రకాశించకుండా కమ్ముకున్న మంచు



చాగలమర్రిలో సూర్యుడు ఉదయించాక కూడా..

ఇటీవలి కాలంలో ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా చలి తీవ్రత పెరిగింది. దీంతో ప్రధాన రహదారులపైపై వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారుతోంది. ఈ కారణంగా ఆటోలు, ద్విచక్రవాహనదారులు సైతం ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. సోమవారం ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పలుప్రాంతాల్లో తెల్లవారుజాము నుంచి ఉదయం 8:30 గంటల వరకు పొగమంచు కమ్మేసింది. పొద్దు పొడిచినా సూర్యుడు కనపడకుండా కప్పేస్తున్న పొగ మంచు వాహనదారులను భయపెడుతోంది. గోనెగండ్ల మండలంలో మంచులో వెళ్లడంతో రోడ్డు సరిగ్గా కనపడక ఓ ద్విచక్ర వాహనదారుడు అదుపు తప్పి గుంతలో పడి గాయాలపాలయ్యాడు. ఈ ఏడాది చలి తీవ్రత అధికంగా ఉంటుందని వాతావరణ విభాగం శాస్త్రవేత్తలు కూడా చెబుతున్నారు. ఇదిలా ఉంటే కొలిమిగుండ్ల మండలంలో సాగవుతున్న కంది, శనగ పంటలు పొగ మంచు కారణంగా పూత రాలిపోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- గోనెగండ్ల/కోసిగి/ కొలిమిగుండ్ల/ చాగలమర్రి/రుద్రవరం (ఆంధ్రజ్యోతి)

యువత హస్తకళలు నేర్చుకోవాలి

● వ్యవసాయ రంగం తర్వాత పెద్దరంగం హస్తకళలే

● రాష్ట్రపతి 'శిల్పగురు' పురస్కార గ్రహీత కె. శివప్రసాద రెడ్డి



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

కర్నూలు కల్చరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): యువత హస్తకళల వైపు దృష్టి సారించి, నేర్చుకోవాలని సాఫ్ట్‌వేర్ రంగానికే పరిమితం కావద్దని యునెస్కో-సీసీఐ సీల్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డు గ్రహీత, నంద్యాల జిల్లా బనగానపల్లెకు చెందిన కలంకారీ చిత్ర కళాకారుడు కె. శివప్రసాదర రెడ్డి అన్నారు. సోమవారం నుంచి జాతీయ హస్తకళల వారోత్సవాలు ప్రారంభమైన సందర్భంగా నగరంలోని లేపాక్షి ఎంపోరియంలో ఆయన్ను రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయనతో కలిసిన 'ఆంధ్రజ్యోతి'తో ముఖాముఖి మాట్లాడారు. ఆ విశేషాలు ఇవి....

ప్రశ్న : పద్మశ్రీ తప్ప హస్తకళారంగంలో ఎన్నో అవార్డులు సాధించేశారు. మీకు ఎలా అనిపిస్తోంది.

జవాబు : ఏదీ నేను ఆశించి ప్రయత్నించలేదు. ఏదైనా శ్రద్ధగా పనిచేయడమే లక్ష్యంగా ముందుకు పోయాను. అవకాశం ఉంటే పద్మశ్రీ పురస్కారం కూడా రావచ్చేమో.

ప్రశ్న : ఫ్యాక్షన్ నేపథ్యం ఉన్న చిన్న పల్లెటూరిలో పుట్టి, అంతర్జాతీయ స్థాయిలో కళాకారుడిగా ఎదిగారు. వెనక్కి తిరిగి చూసుకుంటే ఎలా ఉంది..?

జవాబు : నిజమే. ఎప్పుడో 46 ఏళ్ల క్రితం చిత్రకళను ప్రారంభించిన నేను ఈ స్థాయికి చేరుకుంటానని ఊహించలేదు. రైతు బిడ్డగా జన్మించిన నేను పది వరకు చదువుకొని, తర్వాత డ్రాయింగ్‌లో హయ్యర్ పూర్తిచేసి, తర్వాత డిగ్రీ పాసై, గొప్ప వ్యక్తుల వద్ద శిక్షణ తీసుకున్న తర్వాతే ఈ స్థాయికి చేరాను. విదేశాల్లో కూడా నా చిత్రకళా ఉత్పత్తులకు ఆదరణ లభించడం సంతోషంగా ఉంది. యునెస్కో అవార్డు 2002లో, అలాగే 2015లో భారతీయ హస్తకళల విభాగంలో జాతీయ స్థాయిలో అత్యున్నత పురస్కారంగా శిల్పగురు (మాస్టర్ ఆర్టిసన్) ప్రదానం చేస్తారు. భారత ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్ ఆధ్వర్యంలో ప్రదానం చేసే ఈ పురస్కారం కింద రూ.2 లక్షలు నగదు, ప్రశంసాపత్రాన్ని భారత రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకోవడం సంతోషంగా ఉంది.

ప్రశ్న : కలంకారీ కళలో శిక్షణలు ఇస్తున్నారా..?

జవాబు : కొందరు నేర్చుకుంటున్నారు. అలాగే ఆన్‌లైన్‌లోనూ శిక్షణలు ఇస్తున్నాను. ఈ కళను కొనసాగించడానికి 'కళాక్షేత్ర'ను స్థాపించాను.

ప్రశ్న : మీరు సాధించిన రికార్డులు...?

జవాబు : ప్రపంచంలోనే అతిపెద్ద కలంకారీ పెయింటింగ్ 'భారత చిత్ర ఇతిహాసం' ఇది లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం పొందింది. ఈ పెయింటింగ్ రామాయణం, భాగవతం, మహా భారతాలను వివరిస్తుంది. 47 అడుగులు వెడల్పు, 11 అడుగుల ఎత్తు ఉంటుంది. నా పెయింటింగ్‌లలో రామాయణ, భాగవతాలను తెలియజేసేది షంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో పెట్టారు. అలాగే రామాయణానికి సంబంధించిన మరో పెయింటింగ్ ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఏర్పాటు చేశారు.

ప్రశ్న : భారతీయ హస్తకళలకు ఆదరణ తగ్గిపోతోంది. ఇది నిజమేనా..?

జవాబు : అవును. మన దేశ సంస్కృతికి ప్రతిబింబాలుగా నిలిచేవి హస్తకళలు, చేనేత వస్త్రాలు. వీటిపై బాగా దెబ్బపడింది. పవర్‌లూమ్స్ వచ్చి, చేనేత కార్మికుల జీవితంపై పెద్ద దెబ్బతీశాయి. నేతన్నలు నేసే వస్త్రాలకూ, యంత్రాల్లో తయారయ్యే వస్త్రాలకూ ఎంతో వ్యత్యాసం ఉంటుంది. అలాగే హస్తకళాకారులు తయారు చేసే వాటికి యంత్రాలతో రూపొందించే వాటికి తేడా ఉంటుంది. ఒక చిత్రం నెలలు కష్టపడి ఒక కలంకారీ కళాకారుడు గీస్తాడు. కానీ కంప్యూటర్ ద్వారా దాన్ని కాపీ చేసి వేలాది చిత్రాలను మార్కెట్లో విడుదలై పోతాయి.

ప్రశ్న : హస్తకళలకు పూర్వవైభవం రావాలంటే ఏం చేయాలి..?

జవాబు : ఇది ప్రభుత్వాల బాధ్యత. నిధులు బాగా కేటాయించి, కళాకారుల ఉత్పత్తులకు ఆదరణ కల్పించాలి. యాంత్రిక శక్తిని తగ్గించి, కళాకారులకు శిక్షణలు, విక్రయ ప్రదర్శన కేంద్రాలు పెంచాలి. కేవలం వారోత్సవాలతో కాకుండా ఏడాది పొడవునా కార్యాచరణ కార్యక్రమాలు కొనసాగించాలి. ముఖ్యంగా యువతకు ఈ రంగంలోనూ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు బాగా పెంపొందించాలి. సాఫ్ట్‌వేర్ రంగాలతో పోటీపడేలా చేనేత, హస్తకళా రంగంల్లోనూ అత్యాధునిక మార్పులతో అభివృద్ధి దిశగా నడిపించాలి.

మేము ఇంతే...!

● వైట్ బోర్డు వాహనాలను వినియోగిస్తున్న అధికారులు

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఒక చిన్న అటెండర్ స్థాయి ఉద్యోగం కాదు.. వారు మండల, జిల్లా స్థాయి అధికారులే.. ప్రభుత్వ నియమ నిబంధనలను అమలుపరిచే అధికారులే దారి తప్పుతున్నారు. నియమ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశిస్తే.. అధికారులు మాత్రం మేము ఇంతే అనే ధోరణిలో వ్యవహరించడం కొసమెరుపు. సొంత అవసరాల వినియోగం కోసం తెల్లబోర్డు వాహనాన్ని మాత్రమే వినియోగించాలి కానీ వివిధ పనుల నిమిత్తం అధికార హోదాలో ఓనర్ కం డ్రైవర్ కలిగిన వాహనం మాత్రమే అధికారులు వినియోగించాలి. ప్రభుత్వ కార్యాలయాల్లో అద్దె వాహనాలను వినియోగించాలి. అయితే అధికారులు సొంత వాహనాలను వినియోగించి ప్రభుత్వ సొమ్మును కాజేస్తున్నారు. వైట్ నెంబర్ ప్లేటు వాహనాలపై ఆన్ డ్యూటీ అని ప్రభుత్వ స్టిక్కర్‌తో అధికారికంగా విధులు నిర్వహిస్తున్నారు. కొందరు అధికారులు తమ పీసీలు, అటెండర్లను కారు డ్రైవర్లుగా వినియోగించుకుంటున్నారు. అధికారులు సొంత వాహనాలను వినియోగించుకుని బిల్లులు పెట్టి జిల్లా ట్రెజరీ అధికారులకు కళ్లు కప్పి నిధులను స్వాహా చేస్తున్నా కూడా ఉన్నతాధికారులు కూడా ప్రశ్నించకపోవడం గమనార్హం. ఎల్లో బోర్డుతో బ్యాంకు రుణాలు తీసుకున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ డ్రైవర్ కం డ్రైవర్స్ రుణాలు చెల్లించకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఎల్లోబోర్డు కలిగి డ్రైవర్స్ కం ఓనర్ వాహనాలకు మాత్రమే అనుమతించాలని వారు కోరుతున్నారు.





8, 9 తేదీల్లో సాహిత్య సదస్సు

కర్నూలు అర్బన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): 21వ శతాబ్ది మహిళా సాహిత్యం సమాలోచనతో వచ్చేనెల 8,9 తేదీల్లో క్లస్టర్ వర్సిటీలో అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ జి. శ్రీనివాస్ అన్నారు. సోమవారం ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ఇందిరా శాంతితోపాటు ఆయన మాట్లాడుతూ రెండు రోజుల పాటు తెలుగు అధ్యయన శాఖ, తెలుగు పౌరసత్వ వైభవం, సాహితీ సంస్థ నిర్వహిస్తుందని తెలిపారు. సదస్సు కన్వీనరు వి. వింధ్యా వాసీనీదేవి మాట్లాడుతూ 21వ శతాబ్ది మహిళల సాహిత్యంపైనే సదస్సు జరగడం ఇదే ప్రథమం అని దేశ, విదేశాల నుంచి ఎందరో అతిథులు హాజరవుతారని తెలిపారు. సాహిత్యాభిమానులు, ఆచార్యులు, అధ్యాపకులు ఈ సదస్సులో పాల్గొని పరిశోధన పత్రాలను సమర్పించాలని కోరారు. సదస్సు పత్రాలతో కూడి వ్యాస సంకలనాన్ని సదస్సు రోజున ఆవిష్కరిస్తామని తెలిపారు. పరిశోధకులు తమ వ్యాసాన్ని జనవరి 1లోపు పంపాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9705383422కు సంప్రదించాలని సూచించారు.

ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి మృతి

కొత్తపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎదురుపాడు గ్రామంలో ఆత్మహత్యాయత్నం చేసిన తేనె శివశంకర్ (35) చికిత్స పొందుతూ సోమవారం మరణించాడు. గ్రామానికి చెందిన శివశంకర్ తన అన్నదమ్ముల ఆస్తి పంపకాల వివాదంలో తలెత్తిన వివాదం ఫలితంగా భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో శివశంకర్ ఈ నెల 6వ తేదీ రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పంటలకు క్రిమిసంహారక మందు తాగాడు. అపస్మారక స్థితికి వెళ్లిన శివశంకర్‌ను కుటుంబ సభ్యులు ఆత్మకూరులోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సలహా మేరకు కర్నూలులోని ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక సోమవారం మృతి చెందాడు. మృతుని తల్లి భాగ్యమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ రవీంద్రబాబు వెల్లడించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి..


సురేంద్ర (ఫైల్)

బనగానపల్లె, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందివర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలుకూరు గ్రామానికి చెందిన సురేంద్ర (44) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. నందివర్గం ఎస్ఐ వెంకటసుబ్బయ్య సోమవారం తెలిపిన వివరాలవీ.. సురేంద్ర తన ఇంట్లో ఉదయం 10 గంటల సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మీటరు దగ్గరకు ఫ్యూజ్ పోయిందని గుర్తించి సరిచేయడానికి ప్రయత్నిస్తుండగా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. వెంటనే కుటుంబ సభ్యులు, బంధువులు పలుకూరు వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారని ఎస్ఐ తెలిపారు. సురేంద్ర భార్య సంధ్యాసుధ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. సురేంద్రకు భార్యతో పాటు కూతురు ఉంది.

వృద్ధుడి ఆత్మహత్య

పాములపాడు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని క్రిష్ణానగర్ గ్రామానికి చెందిన మాదాసు బాలయ్య (60) సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. పాములపాడు ఎస్ఐ సురేశ్‌బాబు తెలిపిన వివరాలు.. క్రిష్ణానగర్‌కు చెందిన బాలయ్య తాగుడుకు బానిసై తిరుగుతుండే వాడు. మద్యం తాగడం మానుకోవాలని ఇంట్లో వారు మందలించడంతో మనస్తాపానికి గురై పురుగుల మందు తాగాడు. బాలయ్య భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కాలువలో దూకిన వృద్ధురాలు

- కాపాడిన మత్స్యకారులు
- కుమారుడి ఆత్మహత్యతో మనస్తాపం

పాములపాడు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఒక్కగానొక్క కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడన్న మనస్తాపంతో ఓ వృద్ధురాలు ఆత్మహత్య చేసుకోవాలని ఎస్ఆర్‌ఎంసీ కాలువలో దూకింది. దీన్ని గమనించిన మత్స్యకారులు ఆ వృద్ధురాలిని కాపాడారు. పాములపాడు పోలీసులు తెలిపిన వివరాలివీ.. జూపాడుబంగ్లాకు చెందిన ఏసమ్మ మూడు రోజుల క్రితం గుత్తికి వెళ్లింది. తిరిగి ఇంటికి వచ్చి చూడగా ఆమె కుమారుడు ఉరి వేసుకున్నాడు. దీంతో ఆమె మనస్తాపానికి గురైంది. ఆత్మకూరుకు బస్సులో వెళ్తూ పాములపాడు మండలం కంబాలపల్లి గ్రామంలో దిగి శివారులోని ఎస్ఆర్‌ఎంసీ కాలువలో దూకింది. దీంతో అటువైపుగా వెళ్తున్న వారు కేకలు వేయడంతో కాలువలో చేపలు పడుతున్న మత్స్యకారులు వృద్ధురాలిని కాపాడి ఎస్ఐ సురేశ్‌బాబుకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ ఆమె బంధువులను పిలిపించి వారికి అప్పగించారు.

రైల్వే ఉద్యోగికి రెండేళ్ల జైలు, జరిమానా

కర్నూలు లీగల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టర్‌కు చెల్లించాల్సిన బిల్లు మొత్తం ప్రాసెసింగ్ చేయడానికి లంచం డిమాండ్ చేసిన రైల్వే ఉద్యోగికి రెండేళ్ల కారాగార శిక్షతో పాటు రూ.20వేల జరిమానా విధిస్తూ కర్నూలు సీబీఐ కోర్టు న్యాయాధికారి ఎం.శోభారాణి సోమవారం తీర్పు చెప్పారు. సీబీఐ కథనం మేరకు.. గుంతకల్లులోని దక్షిణ మధ్య రైల్వేలో కాంట్రాక్టు పనులను ఫిర్యాది కాంట్రాక్టర్ రాజుల నాయుడు రూ.30 లక్షల మేరకు పూర్తి చేశారు. అయితే ఆ కాంట్రాక్టు మొత్తం రాకపోవడంతో అకౌంట్స్ అసిస్టెంట్ అయిన చల్లా శ్రీనివాసులు రూ.15వేలు లంచం డిమాండ్ చేశారు. దీంతో కాంట్రాక్టర్ సీబీఐ అధికారులను ఆశ్రయించాడు. ఈ మేరకు 2017 నవంబరు 20వ తేదీన రాజుల నాయుడు నుంచి శ్రీనివాసులు రూ.15వేలు లంచం తీసుకుంటుండగా.. సీబీఐ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. ఈ మేరకు సీబీఐ అధికారులు కేసు నమోదు చేసి కోర్టులో చార్జ్‌షీటు దాఖలు చేశారు. కోర్టులో నేరం రుజువు కావడంతో రెండేళ్ల కారాగార శిక్ష, రూ.20వేలు జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరుపున ఎస్.మనోహర్ వాదించారు.

ట్రావెల్ బస్సుకు భారీ జరిమానా

డోన్ రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజోతి): బీహార్‌కు చెందిన ట్రావెల్ బస్సుకు డోన్ ఆర్టీవో అధికారులు భారీ జరిమానా విధించారు. అనంతపురం నుంచి హైదరాబాదుకు ఏడుగురు ప్రయాణికులతో వెళ్తున్న ట్రావెల్ బస్సును హైవే పై ఆర్టీవో క్రాంతి కుమార్ ట్రావెల్ బస్సును ఆపి తనిఖీ చేసే ప్రయత్నం చేయగా.. డ్రైవర్ ఆపకుండా పారిపోయేందుకు ప్రయత్నించాడు. బస్సును వెంబడించి డోన్ మండలం జగదుర్తి గ్రామ సమీపంలో హైవే రోడ్డుపై బస్సుకు అడ్డంగా నిలిపి తనిఖీ చేయగా.. రోడ్డు ట్యాక్స్ లేదని గుర్తించి రూ.4.91 లక్షల జరిమానా విధించినట్లు ఆర్టీవో తెలిపారు.

కూలీల ఆటో బోల్తా..

కోసిగి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పత్తి పనులకు వెళ్తున్న కూలీల ఆటో సోమవారం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కౌతాళం మండలం కరిణి గ్రామానికి చెందిన ఎల్లమ్మ అనే మహిళ తీవ్రంగా గాయడిందని కోసిగి ఎస్ఐ రమేష్ రెడ్డి తెలిపారు. కౌతాళం మండలంలోని కరిణి గ్రామానికి చెందిన మహిళా కూలీలు అదే గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ మహేంద్ర ఆటోలో మాధవరం గ్రామానికి పత్తి కూలీ కోసం బయలుదేరారు. అయితే కొద్దిసేపటికే వందగల్లు గ్రామ సమీపంలో ఎదురెదురుగా రెండు ఆటోలు తప్పించే ప్రయత్నంలో బోల్తా పడింది. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

కుక్కల దాడిలో 11 మందికి గాయాలు

- పత్తికొండ, మద్దికెరలో ఘటనలు

పత్తికొండ టౌన్/మద్దికెర, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పత్తికొండ, మద్దికెరలో సోమవారం కుక్కలు దాడి చేయడంతో 11 మంది గాయపడ్డారు. వివరాలివీ.. పత్తికొండ పట్టణంలో రాత్రి ఓ కుక్క దాడి చేయడంతో ఐదుగురికి గాయాలయ్యాయి. పట్టణంలోని గుండప్ప హోటల్ సమీపంలో అటుగా వెళ్తున్న గోవిందు, శ్యామ్‌కుమార్, చిన్నారి వెంకట్‌ను కుక్క కరిచింది. అలాగే మరో ఇద్దరిని కూడా ఆ కుక్క కరిచి గాయపరిచింది. గాయపడిన వారంతా ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందుతున్నారు.

మద్దికెర గ్రామంలోని ఆయా ప్రాంతాల్లో సోమవారం వీధి కుక్కలు ఆరుగురిపై దాడి చేసి కరిచాయి. దీంతో బాధితులు ఇంజెక్షన్లు వేయించుకోవడానికి స్థానిక ఆసుపత్రికి వచ్చారు. బాధితులు మాట్లాడుతూ గ్రామంలో వీధి కుక్కల బెడద ఎక్కువైందని, ప్రజలపై ఎక్కడ పడితే అక్కడ దాడులు చేస్తున్నాయని అన్నారు. పంచాయతీ అధికారులు స్పందించి కుక్కలను బయటకు తరలించాలని కోరుతున్నారు. ప్రభుత్వ వైద్యాధికారి రాగిణి మాట్లాడుతూ వైద్యశాలలో కుక్క కరిచిన వారికి యాంటి రేబీస్ నివారణ ఇంజెక్షన్లు అందుబాటులో ఉన్నాయని, కుక్కకాటుకు గురైన వారికి వేస్తున్నామని తెలిపారు.

తడకనపల్లె రోల్ మోడల్

- ఇక రాష్ట్రమంతటా పశువుల హాస్టళ్లు
- ఉమ్మడి జిల్లాలో నియోజకవర్గానికి ఒక పశు హాస్టల్
- స్థలాల కోసం ప్రతిపాదనలు పంపాం : జేడీ హేమంత్ కుమార్


కల్లూరు మండలం తడకనపల్లెలో పశువుల హాస్టల్

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసి వారిని లాభాలబాట పట్టించేందుకు వినూత్న పథకాలను అమలు చేస్తున్నది. రైతు లాభాల బాట పట్టాలంటే కేవలం వ్యవసాయం మాత్రమే సరిపోదని, ప్రత్యామ్నాయ మార్గాలను చూపాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా పాడి పరిశ్రమను కొత్త పుంతలు తొక్కించేందుకు చర్యలు చేపట్టింది. మూగ జీవాలకు నీడ కల్పించందుకు హాస్టళ్ల ఏర్పాటుకు సిద్ధమైంది. దశాబ్దం కిందటే కర్నూలు జిల్లా కల్లూరు మండలం తడకనపల్లె గ్రామంలో పాడిగేదెలకు హాస్టల్ నిర్వహణ పథకానికి బీజం వేయడంతో ఆ పథకాన్ని పొదుపులక్ష్మి గ్రూపుల మహిళలు దిగ్విజయంగా నడిపిస్తున్నారు. ఈ పథకానికి అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రీకారం చుట్టారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతి నియోజకవర్గంలో తడకనపల్లెలో మాదిరి పాడిగేదెలకు హాస్టల్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగా ఈ హాస్టల్ ఏర్పాటు కోసం విధి విధానాలను రూపొందించి వెంటనే ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాలంటూ పశుసంవర్ధక శాఖ కమిషనర్‌కు ఆదేశాలు ఇచ్చారు. ఇందులో భాగంగా పశుసంవర్ధక శాఖ కమిషనరేట్ నుంచి జిల్లా కేంద్రంలోని పశుసంవర్ధకశాఖ జేడీ కార్యాలయానికి ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఒక్కో హాస్టల్‌కు రూ.10 లక్షలు..

పాడి పరిశ్రమ అభివృద్ధికి గత టీడీపీ పాలనలో మెగా గోకులాల పేరిట షెడ్లు నిర్మించి రైతులకు చేయూత అందించారు. ఆ తర్వాత ఏర్పడిన వైసీపీ ప్రభుత్వం వీటి నిర్వహణను పట్టించుకోలేదు. మళ్లీ కూటమి ప్రభుత్వం అన్ని నియోజకవర్గాల్లో పశువులకు వసతి గృహాలు నిర్మించడానికి నిర్ణయం తీసుకున్నారు.

పశువుల సంరక్షణ, పోషణకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రూ.10 లక్షల దాకా కేటాయించనున్నారు. ఒక్కో హాస్టల్‌లో 20 నుంచి 30 పశువులకు వసతి కల్పించనున్నారు. పాడిగేదెలకు అవసరమైన పశుగ్రాసాన్ని సమకూర్చడంతో పాటు వాటికి తాగునీరు, పాలు పితికేందుకు, పశుగ్రాసాన్ని చిన్న చిన్న ముక్కలు చేసేందుకు యంత్రాలను హాస్టల్‌లో ఏర్పాటు చేయనున్నారు. గేదెల పేడ నుంచి బయోగ్యాస్, సేంద్రియ ఎరువుల తయారీ పాల ఉత్పత్తితో రైతులకు ఆదాయం పెంచాలనే లక్ష్యంగా ఈ పథకాన్ని అమలు చేయనున్నట్లు పశుసంవర్ధక శాఖ అధికారులు తెలిపారు. ఈపశు హాస్టళ్ల నిర్వహణను పొదుపు లక్ష్మి గ్రూపు మహిళలకు, రైతుల సంఘాలకు అప్పగిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో బయట వెళ్లిన రైతుల పశువులకు, పట్టణాల్లోని బహిరంగ ప్రదేశాల్లో తిరుగుతున్న పశువులకు హాస్టల్ ఏర్పాటు చేస్తారు. పశువులను రక్షించడానికి, అదే విధంగా రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడానికి ఈ పశు హాస్టల్స్ ఎంతో ఉపయోగపడుతాయని అధికారులు తెలిపారు.

ఉపాధి హామీ నిధులతో పశువులకు హాస్టళ్లు

జిల్లా నీటి యాజమాన్య సంస్థ నిర్వహిస్తున్న ఉపాధి హామీ పథకం ద్వారా పశువుల హాస్టళ్ల ఏర్పాటుకు నిధులు సమకూర్చేందుకు ప్రభుత్వం నిర్ణయించినట్లు పశుసంవర్ధకశాఖ జేడీ హేమంత్ కుమార్ తెలిపారు. ఇందులో భాగంగా ప్రతి నియోజకవర్గంలో ఒక పశు హాస్టల్‌ను ఏర్పాటు చేసేందుకు కనీసం పదెకరాల స్థలాన్ని కేటాయించాలంటూ రెవెన్యూ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించామని ఆయన సోమవారం విలేకరులకు తెలిపారు.

స్థలాల కోసం ప్రతిపాదనలు పంపాం

రైతులను పోషిస్తున్న మూగ జీవాలకు రక్షణ కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం నియోజకవర్గానికి ఒక పశు హాస్టల్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. వీటి ఏర్పాటుకు ఉపాధి హామీ నిధులను ఖర్చు చేయనున్నారు. ఒక్కో హాస్టల్‌కు దాదాపు పదెకరాల స్థలం అవుతుంది. విధి విధానాలను పూర్తిగా నీటి యాజమాన్య సంస్థ ద్వారా అమలు చేస్తారు. ఇప్పటికే తాము అన్ని నియోజకవర్గాల్లో పశు హాస్టళ్ల ఏర్పాటుకు అవసరమైన స్థలాలను కేటాయించాలని రెవెన్యూ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపంచాం. **- హేమంత్ కుమార్, జేడీ**

కాపు, బీసీ భవనాల నిర్మాణానికి సహకరిస్తా

- రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్
- కాపు భవన్ నిర్మాణానికి భూమిపూజ


మంత్రి టీజీ భరత్‌ని సన్మానిస్తున్న కాపు సంఘం నాయకులు

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాపు, బీసీ భవనాల నిర్మాణాలను తాను పూర్తిగా సహకరిస్తానని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక నగరంలోని బీ.క్యాంపులో కాపు, బీసీ భవనాల నిర్మాణానికి మంత్రి టీజీ భరత్ పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 2014 సంవత్సర కాలంలో ఉన్న అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం కాపు, బీసీ భవనాల నిర్మాణాలకు చర్యలు చేపట్టిందని, నిధులు కేటాయించి నిర్మాణాలను పునాది స్థాయికి తీసుకొచ్చిందన్నారు. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ పనులను అర్ధాంతరంగా ఆపేయడం, నిధులు కేటాయించకపోవడంతో కాపు, బీసీల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. 2024 ఎన్నికల సమయంలో ప్రచారానికి వచ్చినప్పుడు ఈ ప్రాంతంలో దట్టమైన చెట్ల పొదలు, గుంతలతో ఉందని, అప్పుడే వారికి రెండు భవనాలు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని వాగ్దానం ఇచ్చామన్నారు. హామీ మేరకు కాపు భవన నిర్మాణానికి రూ.1.50 కోట్లు, బీసీ భవన నిర్మాణానికి రూ.2 కోట్లు, టీజీవీ సంస్థల ద్వారా నిధులు కేటాయించి 8 నెలల్లో కాంట్రాక్టర్ ప్రభాకర్ ద్వారా నాణ్యతతో కూడిన పనులతో పార్కింగ్ ప్రదేశంతో సహా పూర్తి చేసేవిధంగా చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో చర్యలు తీసుకుంటోందన్నారు. రాష్ట్రంలో సుస్థిర పాలన సాగుతోందని, సుస్థిర పాలనతో అభివృద్ధి వేగవంతం అవుతుందన్నారు. బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ ప్రసూన, బీసీ కార్పొరేషన్ ఈడీ జాకీర్ హుసేన్, కాపు, జనసేన జిల్లా అధ్యక్షుడు సురేష్ బాబు, నగర బలిజ సంఘం గౌరవాధ్యక్షులు పత్తి ఓబులయ్య, రామస్వామి, అధ్యక్షుడు గాండ్ల లక్ష్మన్న, ప్రధాన కార్యదర్శి రవికుమార్, ప్రధాన సలహాదారుడు సోమశేఖర్, ఉపాధ్యక్షుడు ఈశ్వర్ కుమార్, నాయకులు నారాయణ రెడ్డి, రామకృష్ణ, సహదేవుడు, కుళ్లాయప్ప, ప్రకాశ్ బాబు, రామిరెడ్డి, బీసీ సంఘం నాయకుడు నక్కలమిట్ట శ్రీనివాసులు, రాంబాబు ఉన్నారు.

డ్వాక్రా మహిళలే డిజిటల్ శక్తులు


డిజి-లక్ష్మి కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే గౌరు చరిత

- పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత

కల్లూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): డ్వాకా మహిళలే డిజిటల్ శక్తులని, డిజి-లక్ష్మితో నగరాల్లో నూతన సేవా కేంద్రాలు అందుబాటులోకి రానున్నాయని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి పేర్కొన్నారు. సోమవారం కల్లూరు అర్బన్ 37వ వార్డులో మెప్మా ఆధ్వర్యంలో ఎమ్మెల్యే విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కె.పార్వతమ్మతో కలిసి డీజీ లక్ష్మి కామన్ సేవా కేంద్రాన్ని ప్రాంభించారు. రాష్ట్ర ప్రభుత్వం డిజి-లక్ష్మి పథకం ద్వారా పట్టణాల్లో స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో 9వేలకు పైగా కామన్ సర్వీస్ సెంటర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుందన్నారు. టీడీపీ బీసీ సెల్ కార్యదర్శి కాసాని మహేష్‌గౌడ్, తెలుగు యువత అధ్యక్షుడు జవ్వాజి.గంగాధర్‌గౌడ్, క్లస్టర్ ఇన్‌చార్జ్ జనార్ధన్‌ఆచారి, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

- 37వ వార్డు వీకర్‌సెక్షన్ కాలనీలోని అర్బన్ హెల్త్ సెంటర్‌ను ఎమ్మెల్యే తనిఖీ చేశారు. రోగులతో మాట్లాడిన ఎమ్మెల్యే హెల్త్ సెంటర్‌లో సమస్యలు సేవలను తెలుసుకున్నారు. టీడీపీ నాయకులు నాగేశ్వరరావు, ఖాదర్ పాల్గొన్నారు.

ఎకరాకు రూ.30 లక్షలు ఇవ్వాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

ఓర్వకల్లు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తమకు ఎకరాకు రూ.30లక్షల పరిహారం ఇవ్వాలని మండలంలోని ఎన్.కొంతలపాడు గ్రామానికి చెందిన రైతులు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ విద్యాసాగర్‌కు బాధిత రైతులు వినతి పత్రం సమర్పించారు. బాధిత రైతులు శ్రీనివాసులు, కృష్ణుడు, కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వం గతంలో ఎకరాకు రూ.15లక్షలు ఇచ్చిందన్నారు. అయితే సర్వేనెం. 509లో 22 ఎకరాలు, 12 మంది రైతుల సారవంతమైన భూములు ఉన్నాయని ఏటా రెండు పంటలు పండిస్తూ కుటుంబాలు పోషించుకుంటున్నామన్నారు. కలెక్టర్, ఆర్‌డీవో, తహసీల్దార్ సూచనల మేరకు తాము ఏపీఐఐసీకి భూములు ఇచ్చేందుకు అంగీకరించామని, అయితే ఎకరాకు రూ.30లక్షలు నష్టపరిహారం చెల్లిస్తేనే భూములు ఇస్తామనీ, లేనిపక్షంలో ఇచ్చే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. వెంకటేశ్వర్లు, నారాయణ, వెంకటరామిరెడ్డి, చంద్రుడు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీ


రికార్డును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

నంద్యాల ఎడ్యుకేషన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ఎరువుల షాపులను, డీలర్ల కార్యాలయాలను జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు సోమవారం తనిఖీ చేశారురు. డీఎంఆర్, గోకుల్ ఏజన్సీస్‌లలో స్టాక్ రిజిస్టర్లు, ఇన్వాయిస్‌లను తనిఖీ చేసి యూరియా, డీఏపీ నిల్వల గురించి ఆరాతీశారు. డీలర్ల నుంచి రిటైల్ డీలర్లకు వేసిన బిల్లులను పరిశీలించారు. డీఏవో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతి షాపు యజమాని ప్రభుత్వ అనుమతులు ఉన్న ఎరువులు, పురుగుల మందులను మాత్రమే అమ్మాలని, స్టాక్ బోర్డును ప్రతిరోజు అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. అలాగే ఎరువులు కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరకు అమ్మితే చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. డీఏవో వెంట ఏవో ప్రసాద్‌రావు ఉన్నారు.

ప్రైవేటు బ్యాంకులపై చర్యలు తీసుకోవాలి


పరిశ్రమల కేంద్రం వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): దళిత యువ పారిశ్రామిక వేత్తలను వేధిస్తున్న ప్రైవేటు బ్యాంకర్లకు రాయితీ యూనిట్లను మంజూరు చేయకుండా జిల్లా పరిశ్రమల శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఆనంద్ బాబు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా పరిశ్రమల కేంద్రం వద్ద ఆందోళన చేశారు. దళితులు పారిశ్రామిక వేత్తలుగా ఎదగకుండా నగరంలోని ఓ ప్రైవేటు బ్యాంకు ఇబ్బంది పెడుతోందని ఆరోపించారు. ప్రభుత్వం నుంచి లబ్ధిదారులకు ఇచ్చే రాయితీని విడుదల చేయకుండా, లంచాలు డిమాండు చేస్తున్నారని విమర్శించారు. పరిశ్రమల రాయితీ యూనిట్లను ప్రభుత్వ బ్యాంకులకే పరిమితం చేయాలన్నారు. అనంతరం కార్యాలయ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. విజయమ్మ, డీవైఎఫ్ఐ నాయకులు రాఘవేంద్ర, హుసేన్, అబ్దుల్లా పాల్గొన్నారు.

కేఎంసీ విద్యార్థులు ఆదర్శం


డాక్టర్ మనురాజ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, వైద్యులు

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మెడికల్ కాలేజీ విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయి సదస్సులో ప్రతిభ కనబరుస్తున్నారని, వీరిని ఆదర్శంగా తీసుకోవాలని ప్రిన్సిపాల్ డా.కే.చిట్టినరసమ్మ పిలుపునిచ్చారు. తిరుపతి ఎస్వీ మెడికల్ కాలేజీలో నిర్వహించిన, రాష్ట్ర చర్మవ్యాధుల వైద్యుల సదస్సు (డీవీసీ)లో పీజీ సెకండ్ ఇయర్ విద్యార్థి డా.ఎస్.మనురాజ్‌కు 'బెస్ట్ పేపర్ ఇన్ కేస్ రిపోర్టింగ్'లో ఉత్తమ పేపర్ ప్రజెంటేషన్ అవార్డు లభించింది. ఈ సందర్భంగా డీవీఎల్ డిపార్టుమెంటు విభాగాధిపతి డా.లెక్కల శ్రీదేవి అసోసియేట్ ప్రొఫెసర్ డా.కే.గౌతమితో కలిసి బెస్ట్ పీజీ వైద్య విద్యార్థి డా.ఎస్.మనురాజ్‌ను ప్రిన్సిపాల్ అభినందించారు.

కర్నూలు జీజీహెచ్‌లో ఖరీదైన వైద్యం

- చిన్నారి ప్రాణాలను కాపాడిన వైద్యులు


హెచ్‌వోడీకి స్వీటు ఇస్తున్న తల్లి

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం అలంపూర్ మండలం రాలంపేటకు చెందిన గంగాధర్, రేణుక దంపతుల 18 నెలల కూతురు గీతాన్షికి ఉన్నట్లుండి నడవలేని పరిస్థితి నెలకొంది. దీంతో తల్లిదండ్రులు కర్నూలులోని ఓ కార్పొరేట్ హాస్పిటల్‌కు తీసుకెళ్లగా ఇంజెక్షన్లు వేయాలని, చికిత్సకు రూ.3 లక్షలు పైగా ఖర్చు అవుతుందని చెప్పగా.. నిరుపేదలు కర్నూలు జీజీహెచ్ చిన్న పిల్లల విభాగానికి నవంబరు 29వ తేదీన వచ్చారు. పీడియాట్రిక్ విభాగం హెచ్‌వోడీ డా.బి.విజయానందబాబు చిన్నారిని పరీక్షించి గీరియన్ బారీ (జీబీ) సిండ్రోమ్ లక్షణాలు ఉన్నట్లు గుర్తించి నాలుగో యూనిట్‌లో కేసును అడ్మిషన్ చేయించారు. అక్కడ నాలుగో యూనిట్ చీఫ్ డా.ప్రకాష్ కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.లక్ష్మీనారాయణ చిన్నారికి మెరుగైన వైద్యం అందించారు. ఖరీదైన నాలుగు ఈవీ ఇమ్యునోగ్లబిలిన్స్ ఇంజెక్షన్లు వేసి నడవలేని స్థితిలో ఉన్న చిన్నారి ప్రాణాన్ని కాపాడారు. సోమ వారం చిన్నారిని డిశ్చార్జి చేయగా.. తల్లిదండ్రులు చిన్న పిల్లల విభాగం హెచ్‌వోడీ డా.బి.విజయానంద బాబుకు స్వీట్లు ఇచ్చి కృతజ్ఞతలు తెలిపారు. ప్రైవేటులో ఖరీదైన వైద్యం చేయించుకునే స్థోమత తమకు లేదని, కర్నూలు జీజీహెచ్‌లో డాక్టర్ల రూపంలో దేవుడే తమ బిడ్డకు ప్రాణాన్ని పోశారంటూ తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. హెచ్‌వోడీ మాట్లాడుతూ జీబీ సిండ్రోమ్ అనేది నరాలకు సంబంధించిందని, ఇది వెన్నుపాము ద్వారా ఇన్‌ఫెక్షన్ మొదలై మెదడుకు చేరుకుని ప్రాణాన్ని తీస్తుందని తెలిపారు. సరైన సమయంలో చికిత్స అందించినట్లు తెలిపారు.



సెంట్రల్ పోలీస్ ఉద్యోగాలు

25,487 S.S.C-GD కానిస్టేబుల్ ఉద్యోగాలు. అర్హత: 10th పాస్, వయస్సు: 18-28, ఆన్‌లైన్ ప్రారంభమైనది. వ్రాత పరీక్ష : తెలుగు/ ఇంగ్లీష్ ఉంటుంది. స్టార్ కోచింగ్ సెంటర్ నంద్యాల, సెల్: 87908 44959 (Since:1999)
AJL- 258314

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్‌క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్‌డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ.సంప్ర: 7382114647
AJA- 257599

CHANGE OF SURNAME

I, **BATCHU RAJESWARI** (Old Name)H. No:10-153,Janda peta, Bethamcherala, Nandyal dist., A. P. have changed my name as **BACHU RAJESWARI** (New Name) W/O Bachu Venkata Subramanyam
AJL-258358

CHANGE OF NAME

I, **PUSHPALA KRISHNAVENAMMA** (OLD NAME) W/o BORRA HUSSAINIAH VISWANATH R/o H.No:194, MIG-II, APHB COLONY, NGOs COLONY, RAMAKRISHNA PG COLLEGE BACK SIDE, NANDYAL. I HAVE BEEN CHANGING MY NAME FROM **PUSHPALA KRISHNA VENAMMA** (OLD NAME) TO **PUSPALA KRISHNAVENAMMA** (NEW NAME). HENCE FORTH MY NAME IS **PUSPALA KRISHNAVENAMMA** (NEW NAME).
AJL-258315

CHANGE OF SURNAME

I, **BOYANAPALLI MADEESWARAIAH** (Old Name) H.No:6/116,Cement Nagar, Bethamcherala Mandal, Nandyal dist., A. P. have changed my name as **BAINAPALLE MADEESWARAIAH** (New Name) S/o Boyanapalli Maddaiah
AJL-258358



పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటన దారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు. మేనేజర్ - ఏడివిటి



మల్లన్నకు ప్రత్యేక పూజలు

● వెండి రథంపై ఆదిదంపతుల ఊరేగింపు


వెండి రథంపై ఆది దంపతులు

శ్రీశైలం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలక్షేత్రంలో ప్రధాన దేవాలయానికి ఉపాలయాలుగా ఉండే ఘంటామఠం, భీమశంకరమఠం, విభూతిమఠం, రుద్రాక్ష మఠం, సారంగధార పంచమఠాలలో కొలువై ఉన్న పురాతన శివలింగాలకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సోమవారం సాయంత్రం ప్రధాన ఆలయానికి కుడి వైపు ఉన్న పురాతన రాతి మండపంలో స్వామి, అమ్మవార్లను ఊయలతో ఆశీనులచేసి షోడశోపచార పూజలు నిర్వహించారు. అర్చక వేదపండితులు సహస్ర దీపాలను వెలిగించారు. అనంతరం వెండి రథంలో ఆశీనులైన స్వామిఅమ్మవార్లకు పుష్పార్చనలు చేసి ఆలయ ప్రదక్షిణలు చేశారు. భక్తులు రథోత్సవంలో పాల్గొన్నారు.

మహానందీశ్వరుడికి పల్లకీ సేవ

మహానంది, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో పరమశివుడికి ప్రీతివంతమైన సోమవారం రాత్రి పల్లకీ సేవ భక్తుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మంటపంలో మహానందీశ్వర స్వామి,కామేశ్వరీ దేవి అమ్మవార్ల ఉత్సవమూర్తుల విగ్రహాలను ప్రత్యేక పల్లకిలో ఆశీనులు గావించారు. భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తుల శివనామస్మరణతో పాటు మేళతాళాలతో పల్లకీ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

విగ్రహం ఏర్పాటు పనులను ఆపాలి

నంద్యాల నూనెపల్లి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని జనరల్ ఆసుపత్రి సమీపంలో ప్రధాన రహదారిపై విగ్రహ ఏర్పాటు పనులు నిలిపేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు మహ్మద్ గౌస్, వెంకటలింగం డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో కలెక్టర్ రాజకుమారికి వినతిపత్రం అందించారు. అధికారులు స్పందించి పను లు నిలిపేయాలని కోరారు.

రాష్ట్రస్థాయి పరీక్షలో ప్రతిభ

నంద్యాల ఎడ్యుకేషన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రామానుజన్ మ్యాథ్స్ ఒలింపియడ్‌లో శాంతినికేతన్ విద్యాసంస్థల విద్యార్థులు ప్రతిభను చాటారు. సోమవారం పాఠశాల చైర్మన్ సుధాకర్ హర్షం వ్యక్తం చేస్తూ విద్యార్థులు హరిచరణ్, కే యజ్ఞచరణ్, నరేంద్రరెడ్డిని అభినందించారు.

విత్తన బిల్లుల ప్రతుల దహనం

పగిడ్యాల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ సమావేశాలలో రైతులకు వ్యతిరేకంగా ప్రవేశపెట్టిన విత్తన బిల్లులను ఆమోదించేందుకు ప్రతిపాదనలు చేయడం తగదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు పక్కీర్ సాహెబ్ అన్నారు. సోమవారం బీరవోలు గ్రామంలో రైతులతో కలిసి ప్రతులను దహనం చేశారు. నాయకులు తిక్కస్వామి, రుద్రగౌడ్, శ్రీనివాసులు ఉన్నారు.

భూ సమస్యపై అధికారుల విచారణ

కొత్తపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గువ్వలకుంట్ల ఎస్సీ కాలనీలోని ఓ భూ సమస్యపై రెవెన్యూ సర్వే అధికారులు విచారణ చేపట్టారు. సోమవారం ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే రవీంద్రపాల్, ఇన్‌చార్జి సర్వేయర్ రాజశేఖర్‌తో కలిసి వివాస్పద స్థలాన్ని పరిశీలించి కొలతలు వేయించారు. ఆయన వెంట వీఆర్వో చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి అరుణబాయి, విలేజ్ సర్వేయర్ శ్రీను, గ్రామస్థులు ఆల్‌ఫ్రెడ్, జక్కురయ్య, రోశన్న, జయన్న తదితరులున్నారు.

భక్తిశ్రద్ధలతో విళక్కు మహోత్సవం


పూజలో పాల్గొన్న అయ్యప్ప స్వాములు, టీడీపీ నాయకులు ఎన్ఎండీ ఫిరోజ్

నంద్యాల కల్చరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అయ్యప్పస్వామి దేవాలయంలో అయ్యప్ప సేవా సమాజం ఆధ్వర్యంలో స్వామివారి విళక్కు మహోత్సవం వైభవం గా నిర్వహించారు. ఉదయం కన్నెస్వాములు మేళ వాయిద్యాలతో కలశయాత్ర నిర్వహించారు. చెరువుకట్ట వద్ద ఉత్సవ విగ్రహా నికి జలాభిషేకం చేపట్టారు. ముఖ్య అతిథులుగా టీడీపీ నాయ కులు ఎన్ఎండీ ఫిరోజ్, కౌన్సిలర్ ఖండే శ్యామ్‌సుందర్‌లాల్, చి న్నపురెడ్డి తదితరులు పాల్గొని ఆయుధపూజ, మూలవిరాట్‌కు పు ష్పాభిషేకం, ప్రత్యేక పూజలు చేపట్టారు. అయ్యప్ప ఉత్సవ విగ్ర హానికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. సాయం త్రం దీపాలంకరణ, గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రి అష్టాదశ కలశ్వానిత పడిపూజ మహోత్సవం, ఊంజలసేవ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పూజారి గోపీ స్వామి, గంగిశెట్టి శ్రీధర్, నాగరాజు, బవిరిశెట్టి శ్రీకాంత్, గురుస్వామి లక్ష్మ య్య, రామలింగారెడ్డి,సురేష్, శ్రీరామమూర్తి, అయ్యప్ప సేవాస మాజం సభ్యులు, నాయకులు,కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.


అయ్యప్ప స్వామి గ్రామోత్సవం

మోడల్ స్కూల్‌లో.. సమస్యలు తిష్ఠ

● ఆరుబయట వంటవార్పు
● చుట్టూ అపరిశుభ్రత
● ఇబ్బంది పడుతున్న విద్యార్థులు
● నిద్రావస్థలో విద్యాశాఖ అధికారులు

మహానంది, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.తిమ్మాపురం ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో సమస్యలు తిష్ఠవేశాయి. పరిష్కరించాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. దాంతో విద్యార్థులు అష్టకష్టాలు పడుతున్నారు. మోడల్ పాఠశాలను ఊరికి దూరంగా నిర్మించారు.

దాదాపు 700 మంది విద్యార్థులు చదువుతున్నారు. రహదారి అధ్వానంగా ఉన్నది. అటువైపు వెళ్లడానికి సరియైన రవాణా సౌకర్యం లేదు. బిక్కుబిక్కుమంటూ వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. పాఠశాలలో వంట గదులు నిర్మించకపోవడంతో ఆరుబయట, చెట్లకింద వంట చేస్తున్నారు. తరగతిగదుల్లోకి పొగ చూరి విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.


మోడల్ స్కూల్‌లో ఆరుబయట వంట చేస్తున్న నిర్వాహకులు


ప్రహరీలేని తిమ్మాపురం మోడల్ స్కూల్

ఆరుబయట వంట చేయడంతో చెట్లఆకులు, ఇతర వ్యర్థాలు వంట పాత్రాల్లో పడుతున్నాయి. ఏదైనా జరగరానిది జరిగితే ఎలా అని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. తాగునీటి కొలాయిలు ఏర్పాటు చేసిన ప్రాంతం పరిశుభ్రంగా మారింది. నిలిచిన నీటిలో నిలబడి చేతులు శుభ్రం చేసుకోవాల్సి వస్తుంది. అలాగే మూత్రశాలలు, మరుగుదొడ్లు కూడా శిథిలావస్థకు చేరాయి. చుట్టూ ప్రహరీ కూడా లేదు. విద్యార్థులు సమస్యలతో సతమతమవుతున్న పట్టించుకునే నాథుడే లేడనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా విద్యాశాఖాధికారులు చొరవచూపి సమస్యలను పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

సమస్యలను పరిష్కరిస్తాం

పాఠశాలలో నెలకొన్న సమస్యలపై ఇటీవల పర్యటనకు వచ్చిన స్థానిక ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాం. ఆరుబయట వంట చేయకుండా గదిని నిర్మిస్తానని హామీ ఇచ్చారు. ఉన్నతాధికారుల దృష్టికి కూడా సమస్యలపై నివేదిక ఇస్తాం.

- లక్ష్మణ్‌రావు, ప్రిన్సిపాల్ మోడల్ స్కూల్

మెరుగైన సేవలందించాలి

● వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాజకుమారి


వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల నూనెపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందించి పురోగతి సాధించాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం ఆమె క్యాంపు కార్యాలయం నుంచి ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఈవో ఆర్డీలతో గ్రామ సచివాలయ సర్వీసులు, స్వామిత్వ పురోగతిపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. సిటిజన్ ఈ-కేవైసీ విషయంలో నంద్యాల (అర్బన్), పాములపాడు, పడిడ్యాల, కొత్తపల్లి, బండిఆత్మకూరు, కొలిమిగుండ్ల, సిరివెళ్ల, చాగలమర్రి, బనగానపల్లి (రూరల్), ఆత్మకూరు మండలాల్లో పురోగతి తగ్గిందని, ఈ నెల 12లోపు పెండింగ్ పూర్తి చేయాలని ఆదేశించారు. చిల్డ్రన్ వితౌట్ ఆధార్ నమోదులో పెండింగ్‌లో ఉన్న మండలాలు మహిళా కార్యదర్శులతో సమన్వయం చేసి త్వరగా పూర్తి చేయాలని సూచించారు. సచివాలయ సిబ్బంది హాజరు శాతాన్ని మెరుగుపరిచాలని, రీవెరిఫికేషన్ ఆఫ్ జియో కో ఆర్డినేట్స్‌లో పెండింగ్‌లో ఉన్న 971 పూర్తి చేయాలన్నారు. స్క్రబ్ టైఫస్ వ్యాధి పై ప్రజలకు వెంటనే అవగాహన కలిగించాలని వైద్యాధికారులకు సూచించారు. కార్యక్రమంలో డీఎల్‌డీవో శివారెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి లలితాబాయి పాల్గొన్నారు.

పోలియో వ్యాధిని నిర్మూలించాలి

జిల్లాలోని 0 నుంచి 5 ఏళ్ల పిల్లలందరికీ తప్పకుండా 2 చుక్కల పోలియో వ్యాక్సిన్ వేసి వ్యాధిని శాశ్వతంగా నిర్మూలించాలని కలెక్టర్ రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఆమె కలెక్టరేట్‌ని పీజీఆర్ఎస్ హాల్‌లో డిసెంబరు 21న జరిగే పోలియో కార్యక్రమంపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహిం చారు. కలెక్టర్ మాట్లాడుతూ.. అన్నీ లైన్ డిపార్టుమెంట్లు సమన్వ యంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. అనం తరం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.వెంకటరమణ మాట్లాడు తూ.. జిల్లాలో 0 నుంచి 5 ఏళ్లలోపు పిల్లలు 2,38,404 మంది ఉన్నా రని, 1318 బూతులు ఏర్పాటు చేశామన్నారు. 5272 మంది సిబ్బంది డిసెంబరు 21న పోలియో చుక్కలు వేస్తారన్నారు. మిగిలిన వారికి 22,23 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి చుక్కలు వేస్తారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డా.సుదర్శన్ బాబు , డీసీహెచ్ఎస్ డా.లలిత, ప్రోగ్రామ్ అధికారులు డా. ప్రసన్నలక్ష్మీ, డా. శ్రీజ, డా. శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఫైబర్ టెక్నాలజీతో రోడ్డు నిర్మాణం

● ఎమ్మెల్యే గిత్తా జయసూర్య
● నందికొట్కూరు - పగిడ్యాల బీటీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ


రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

పగిడ్యాల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలలోని రోడ్డు నాణ్యతగా ఉండేందుకు ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా అత్యాధునికమైన ఫైబర్ టెక్నాలజీతో రోడ్ల నిర్మాణాలు చేపట్టిందని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. నందికొట్కూరు- పగిడ్యాల బీటీ రోడ్డు నిర్మాణానికి సోమవారం పగిడ్యాల విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆర్అండ్‌బీ ఈఈ శ్రీధర్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం చంద్రబాబు నాయుడు, రోడ్డు భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి దేశంలోనే మొదటిసారిగా అత్యాధునిక ఫైబర్ టెక్నాలజీతో రోడ్డు నిర్మాణాలు చేపట్టారన్నారు. గార్గేయపురం-మిడుతూరుకు వెళ్లే రహదారికి గతంలో నిధులు మంజూరుకాగా, నిర్లక్ష్యం వహించారన్నారు. నిర్మాణానికి టెండర్లు పిలిచి భూమిపూజ చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. లక్ష్మాపురం నుంచి ప్రాతకోట, ఎన్. ఘనపురం, నెహ్రూనగర్ గ్రామాలకు వెళ్లే రహదారుల నిర్మాణాల కోసం ప్రతిపాదనలు పంపుతామన్నారు. పనుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. కార్యక్రమంలో డీఈ మనోహర్‌రెడ్డి, ఎంపీడీవో సుమిత్రమ్మ, డిప్యూటీ తహసీల్దార్ మధు, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు యాదవ్, మహేశ్వరరెడ్డి, సొసైటీ చైర్మన్ దామోదర్‌రెడ్డి, పుల్యాల రాజశేఖర్‌రెడ్డి, వాసురెడ్డి, మద్దిలేటి గౌడ్, షమీన్, అయ్యన్న, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

టెక్నాలజీపై అవగాహన ఉండాలి

నందికొట్కూరు: విద్యార్థులకు టెక్నాలజీపై అవగాహన ఉండాలని ఎమ్మెల్యే గిత్త జయసూర్య అన్నారు. సోమవారం పట్టణంలోని శ్రీ విజ్ఞాన్ జూనియర్ కళాశాల , వేదాంత్ సంయుక్తంగా అత్యాధునికమైన వేదాంత్ లెర్నింగ్ సెంటర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సాంకేతికత కలిగిన చదువుల వల్ల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, టీడీపీ నాయకులు లాయర్ జాకీర్, వేణుగోపాల్, టౌన్, రూరల్ సీఐలు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, శ్రీ విజ్ఞాన్ జూనియర్ కళాశాల కరస్పాండెంట్ గాంధీ నాయుడు, డైరెక్టర్ డా.వినోద్ కుమార్, ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నియోజకవర్గ అధ్యక్షులు నర్సరాజు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలి


నందికొట్కూరులో ధర్నా చేస్తున్న ఉద్యోగులు,నాయకులు

నందికొట్కూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సొసైటీ ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని నందికొట్కూరు, పగిడ్యాల సీఈవోలు రబ్బాని, ఖాజాబాషా డిమాండ్ చేశారు. సోమవారం సహకార సంఘం సొసైటీ డీసీసీ బ్యాంక్ నందికొట్కూరు బ్రాంచ్ ముందు సొసైటీ ఉద్యోగులు దీర్ఘకాలిక డిమాండ్ల సాధన కోసం ధర్నా నిర్వహించారు. సీపీఐ(ఎంఎల్)లిబరేషన్ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా రబ్బాని, ఖాజాబాషా, నాయకుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జీవో నెంబరు 36ను వెంటనే అమలు చేయాలని, 2019, 2024 పెండింగ్‌లో ఉన్న వేతన సవరణ చేయాలని డిమాండ్ చేశారు. మధ్యంతర భృతి ఇవ్వాలని, గ్రాట్యూటీ చట్టాన్ని అమలు చేయాలని, ఉద్యోగులకు జీతభత్యాలను డీఎల్ఎఫ్ ద్వారా నిరవధికంగా చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో మిడుతూరు మండల సీఈవో మల్లికార్జు, బ్రాహ్మణకొట్కూరు సీఈవో అశోక్‌కుమార్, బ్యాంక్ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని ఆత్మకూరు సొసైటీ మేనేజర్ నాగేశ్వరరావు కోరారు. సోమవారం స్థానిక డీసీసీ బ్యాంకు ఎదుట ఆత్మకూరు, నాగంపల్లి, వేంపెంట సొసైటీల ఉద్యోగుల నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సొసైటీల్లో పనిచేస్తున్న ఉద్యోగులను, సిబ్బందిని రెగ్యూలరైజ్ చేయాలన్నారు. అనంతరం డీసీసీ బ్యాంకు మేనేజర్ మహ్మద్ రసూల్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.



ఆత్మకూరులో విజిలెన్స్ అధికారుల దాడులు

ఆత్మకూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు హోటళ్లు, తినుబండారాల దుకాణాల్లో సోమవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఫుడ్ సెఫ్టీ అధికారులు సంయుక్తంగా దాడులు చేపట్టారు. ప్రత్యేకించి ఆహార పదార్థాల నాణ్యత, జీఎస్టీ చెల్లింపు తదితర అంశాలకు సంబంధించి ఆయా శాఖల అధికారులు తనిఖీ లు చేశారు. పలు హోటళ్లు, బేకరీ, స్వీట్స్ షాపుల్లో సోదాలు చేపట్టి వాటి నమూనాలను సేకరించారు. అలాగే ఆహార పదార్థాల గడువు వివరాలు, రసాయన రంగుల వాడకం తదితర వాటిని పరిశీలించారు. వ్యాపారుల జీఎస్టీ చెల్లింపు విధానాలను ఆరా తీశారు. కాగా పట్టణంలోని అతిథి హోటల్‌లో సరైన పరిశుభ్రత చర్యలు చేపట్టకపోవడంతో రూ.10వేలు, ఆనస్ బేకరీ దుకాణాదారునికి రూ.8వేల చొప్పున జరిమానా విధించినట్లు తెలిసింది. కాగా విజిలెన్స్ దాడుల నేపథ్యంలో పట్టణంలో పలు దుకాణాలను వ్యాపారులు మూసివేశారు. ఈ దాడుల్లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏవో విశ్వనాథ్, ఏసీటీవో వెంకటరమణ తదితరులున్నారు.


హోటల్‌లో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

ఆరుతడి సరే.. వరికి నీరివ్వరా?

(5వ పేజీ తరువాయి)

తెలుగుగంగ ఆయకట్టు భూముల్లో ఇప్పటికే నారు మళ్లు సాగు చేశారు. ఖరీఫ్‌లో నష్టపోయాం, రబీలో గట్టెక్కాలన్న ఆలోచనతో సాగు చే శారు. ఖరీఫ్‌లో రైతులు ప్రకృతి దాడి చేయడంతో పెట్టుబడులు చేతికందని పరిస్థితి నెలకొంది. ఇలాగైతే వ్యవసాయానికి స్వస్తి పలకాలనే యోచనలో ఉన్నామని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

సాగునీరందించి ఆదుకోండి



తెలుగుంగ ప్రధాన కాల్వకు రబీ సీజన్‌లో సాగునీరు అందించి ఆదుకోవాలి. ఖరీఫ్ సీజనులో వరి, మొక్కజొన్న పంటలు కోల్పోయాం. రబీలో సాగునీరు అందిస్తే సాగు చేసుకుని అప్పుల ఊబి నుంచి బయట పడతాం.

- దస్తగిరి

దిగుబడి తగ్గింది



వరి, మొక్కజొన్న దిగుబడి ఖరీఫ్‌లో తగ్గింది. గంగ కాల్వకు సాగునీరు అందిస్తే రబీలో పంటలు సాగు చేసుకుని ఊపిరి పీల్చుకుంటాం. ఖరీఫ్‌లో పెట్టుబడి అంతా పుడమి పాలైంది. రబీలో పంటలు సాగు చేసి గట్టెక్కే ఆశ లో ఉన్నాం.

-నాగిరెడ్డి, రైతు, డి. కొట్టాల

తీవ్రంగా నష్టపోయాం



ఐదెకరాలు కౌలుకు తీసుకుని వరి, మినుము, మొక్కజొన్న ఖరీఫ్‌లో సాగు చేశా. పెట్టుబడి కూడా చేతికందని పరిస్థితి నెలకొంది. నీరందిస్తే పంటలు సాగు చేసుకుని అప్పుల నుంచి బయటపడతాం.

మాబుసాని, కౌలు రైతు, కొండమాయపల్లె

సాగు చేసుకోలేని భూమి మాటేంటి?



ఆరుతడి పంటలు సాగు చేసుకోలేని భూముల మాటేంటి? వరి పంట తప్ప మిగిలిన పంటలు సాగు చేయడానికి వీలు కాని భూములున్నాయి. ఆ రైతులు ఏ పంట సాగు చేసుకోవాలో అధికారులే చెప్పాలి. సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలి.

-నరసింహులు, రైతు సంఘం నాయకుడు, రుద్రవరం మండలం

2026 మార్చి 31 వరకు సాగునీరందిస్తాం

2026 మార్చి 31 వరకు వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయరు నుంచి తెలుగుంగ ప్రధాన కాల్వకు (చెన్నై కాల్వ)కు నీరు సరఫరా చేస్తాం. రైతులు ఆరుతడి పంటలు సాగు చేసుకొని సహకరించాలి.

-ప్రతాప్, ఇన్‌చార్జి ఎస్ఈ, తెలుగుగంగ ప్రాజెక్టు

భూకంపాలపై అవగాహన సదస్సు


అవగాహన కార్యక్రమంలో అతిథులు

పాణ్యం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం భూకంప భద్రతా ప్రమాణాలపై సివిల్ విభాగం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా రూర్కీ కేంద్ర నిర్మాణ పరిశోధనా సంస్థ డైరెక్టర్ రామంచర్ల ప్రదీప్‌కుమార్ హాజరై మాట్లాడుతూ ఐఎస్ 1893-2025లోని నూతన సవరణలు, భూకంప ప్రతిస్పందన విశ్లేషణ, నిర్మాణ భద్రతా పరిరక్షణపై కీలక అంశాలను వివరించారు. మద్రాస్ ఐఐటీ ప్రొఫెసర్ రఘుకాంత్, పాట్నా ఐఐటీ ప్రొఫెసర్ కౌశిక్ రాయ్, మహీంద్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ జయప్రకాష్ ఆధునిక డైనమిక్ అనాలసిస్ పద్ధతులు, భూకంప నిరోధక డిజైన్ సూత్రాలు, భవిష్యత్తు పరిశోధనా దిశలు వంటి అంశాలపై వివరించారు. కార్యక్రమంలో చెన్నరాజారాం, సుప్రియా మొహంతి, కార్తీక్‌రెడ్డి, వృశాలి కమలాకర్, ప్రిన్సిపాల్ జయచంద్రప్రసాద్, హెచ్‌వోడీ శ్రీనివాసులు, అధ్యాపకులు, పరిశోధనా విద్యార్థులు, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయాలి


పోస్టర్ విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు

బండిఆత్మకూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): విశాఖపట్టణంలో ఈనెల 31నుంచి వచ్చే నెల 4 వరకు నిర్వహించనున్న సీఐటీయూ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని నాయకులు రత్నమయ్య, రాజు కోరారు. సోమవారం బండిఆత్మకూరులో వివిధ కాంట్రాక్ట్, కార్మిక సంఘాల నాయకులతో కలిసి వాల్‌పోస్టర్లు విడుదల చేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ, నాలుగు లేబర్‌కోడ్స్ పని గంటల పెంపు తదితర అంశాలపై విస్తృత స్థాయి చర్చలు జరుగుతాయన్నారు. జనవరి 4న బహిరంగ సభ నిర్వహిస్తున్నారని అన్నారు. ప్రతి కాంట్రాక్ట్ ఉద్యోగి, కార్మికులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో వెంకటరమణమ్మ, సువర్ణమ్మ, శ్రావంతి, పుశీలమ్మ, నాగరాజు, శ్యాము, మునిస్వామి పాల్గొన్నారు.

12 నుంచి మహా సంగ్రామ్ క్రీడలు

పాణ్యం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి) : శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాలలో మహాసంగ్రామ్- 25 క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం తెలిపారు. సోమవారం కళాశాలలో బ్రోచర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 12, 13 తేదీల్లో కళాశాల ఆరు విభాగాల మధ్య క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు. బాలికలకు క్రికెట్, త్రోబాల్, టెన్నికాయిట్, బ్యాడ్మింటన్, బాలురకు క్రికెట్, వాలీబాల్, ఫుట్‌బాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజేతలకు నగదుబహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పీడీ చంద్రారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణ

నందికొట్కూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ విధానాన్ని వ్యతిరేకిస్తూ నందికొట్కూరులో వైసీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు సురేష్ యాదవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాధురి గౌడ్ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ చేపట్టారు. సురేశ్ యాదవ్ మాట్లాడుతూ కోటి సంతకాల సేకరణకు విశేష స్పందన వచ్చిందన్నారు. కార్యక్రమంలో వైసీపీ పట్టణ అధ్యక్షుడు మన్సూర్, మైనార్టీ నాయకులు జబ్బార్, సతీష్‌రెడ్డి, నాయక్, మిట్టు పాల్గొన్నారు.

విద్యార్థినులకు 'శక్తి యాప్' ఆయుధం

మహానంది, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ విద్యార్థినులకు శక్తి యాప్ ఆయుధం లాంటిందని శక్తి టీం హెడ్ కాని స్టేబుల్ ప్రసాద్ అన్నారు. సోమవారం గోపవరం జడ్పీ పాఠశాలలో విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. రక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మత్తు పదార్థాలకు బానిసలు కాకూడదన్నారు. కార్యక్రమంలో శక్తి టీం సభ్యులు వెంకటేశ్వర్లు, రఫీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరిలో పంటకోత ప్రయోగం

గోస్పాడు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి) : మండలంలో ఎం చింతకుంట్ల గ్రామంలో వరిలో పంటకోత ప్రయోగాన్ని ఏవో స్వప్నిక ఆధ్వర్యంలో చేశారు. ఎకరాకు దాదాపు 31 బస్తాల దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఆమె మాట్లాడుతూ ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద బీమా చేయించుకున్న పంటలకు పంటకోత ప్రయోగం ఆధారంగా బీమా వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఈవో రామకృష్ణ, వీఏవో వైష్ణవి, ఇన్సూరెన్స్ అధికారి సంధ్య పాల్గొన్నారు.

ముగిసిన కరాటే చాంపియన్ షిప్ పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి

బనగానపల్లె, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఏపీ షిటోరియా కరాటే చాంపియన్ షిప్ పోటీలు సోమవారం ముగిశాయి. ఏపీ షిటోరియా కరాటే అసోసి యేషన్ ఆధ్వర్యంలో బనగానపల్లె పట్టణంలోని ఎమ్మెస్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కరాటే పోటీల్లో విజేతలకు మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి కప్‌లను అందించారు. బాలికా విభాగంలో కర్నూలు డీఎస్‌ఏ స్టేడియానికి చెందిన హాసినీబాయి. బాలికల కుమేతే విభాగంలో తిరు పతికి చెందిన వెంకట సుజాత, బాలుర విభాగంలో బనగానపల్లెకు చెందిన చైతన్యరెడ్డిలు గ్రాండ్ చాంపియన్ సాధించారు. బీసీ రాజారెడ్డి మాట్లాడుతూ బనగానపల్లెలో కరాటే మాస్టర్లు ప్రతాప్‌కుమార్, విజయ్‌లు కళ్యాణ్, సూర్యవంశీల ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో కరాటే పోటీ లు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఒలింపిక్ అసోసియేషన్ కర్నూలు జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, తెలంగాణ అధ్యక్షుడు సాదిక్‌బాషా పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

బేతంచెర్ల, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరంలో ఆదివారం జరిగిన దక్షిణ రాష్ట్ర కరాటే పోటీల్లో బేతంచెర్ల పట్టణంలోని హనుమాన్ నగర్ స్కూల్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి స్వర్ణ, వెండి, కాంస్య పతకాలను కైవసం చేసుకున్నట్లు హెచ్‌ఎం చంద్ర సోమవారం తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులను కోచ్ ఎం చంద్రమోహన్ గౌడ్, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

జిల్లా స్థాయి అబాకస్ పోటీల్లో ..

కర్నూలు నగరంలో సెయింట్ జోసెఫ్ పాఠశాలలో ఆదివారం జరిగిన జిల్లాస్థాయి అబాకస్ పోటీల్లో బేతంచెర్ల సుమేధ ఇంగ్లీష్ మీడియం పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరచారని హెచ్‌ఎం సత్యనారాయణ సోమవారం తెలిపారు. ఈ పోటీల్లో పాఠశాలకు చెందిన 26 మంది విద్యార్థులు పాల్గొనగా 25 మందికి సర్టిఫికెట్లను అందజేశారని ఆయన తెలిపారు. లక్ష్మణ్ సతీష్ అనే విద్యార్థి జిల్లాస్థాయిలో ద్వితీయ స్థానం సాధించినట్లు ఆయన తెలిపారు. విద్యార్థులను పాఠశాల కోఆర్డినేటర్ మహేశ్వరి, ఉపాధ్యాయులు అభినందించారు.

సమస్యల పరిష్కారానికే ప్రజావేదిక



గ్రీవెన్ సెల్‌లో పాల్గొన్న అధికారులు

చాగలమర్రి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసమే ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ విజయ్‌కుమార్ తెలిపారు. సోమవారం చాగలమర్రి తహసీల్దార్ కార్యాలయంలో గ్రీవెన్‌సెల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా శాఖల అధికారులచే సమీక్ష చేశారు. కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయా శాఖల పని తీరు గురించి అడిగి తెలుసుకు న్నారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను వారం రోజుల్లోపు సమస్యలు పరిష్కరించేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్ర మంలో ఎంపీడీవో తాహిర్‌హుసేన్, ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల, ఏవో రంగనేతాజీ, ఏపీఎం నాగమ్మ పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్ దరఖాస్తులపై ప్రత్యేక శ్రద్ధ

కొలిమిగుండ్ల: ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చే దరఖా స్తులపై ప్రత్యేక శ్రద్ధ వహించి పరిష్కరించనున్నట్లు ఎంపీడీవో దస్తగిరి బాబు పేర్కొన్నారు. సోమవారం జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఎంపీడీవో, డిప్యూటీ ఎంపీడీవో చంద్రమౌళీశ్వరగౌడ్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్‌మన్‌పై ఫిర్యాదు

రుద్రవరం: మండలంలోని ఆలమూరు విద్యుత్ లైన్‌మన్ శ్రీనివాసులుపై పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసినట్లు సోమవారం అదే గ్రామానికి చెందిన గోవిందరెడ్డి తెలిపారు. గ్రామంలో అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తుండడంతో ఫిర్యాదు చేశామన్నారు. విద్యుత్ అధికారులకు సమస్యలు తెలిపినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

వైభవంగా ఉమా మహేశ్వరస్వామి పల్లకీ సేవ



స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకులు

బనగానపల్లె, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పల్లకీ సేవ నిర్వహించారు. ఆలయ ఈవో పాండురంగారెడ్డి, పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డి, యాగంటిపల్లె ఉపసర్పంచ్ మౌళీశ్వరరెడ్డితోపాటు భక్తులు, ఆలయ అర్చకులు పల్లకీలో స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు.

వరసిద్ధి వినాయకుడికి పూజలు

సంజామల, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముదిగేడు గ్రామంలో కొలువైన వరసిద్ధి వినాయకుడి సంవత్సరిక వేడుకలు సోమవారం గ్రామ పెద్దల ఆధ్వర్యంలో జరిగాయి. గత ఏడాది దాదాపు రూ.కోటికి పైనే వెచ్చించి గ్రామంలో స్వామి వారిని కొలువుదీర్చారు. ఏడాది సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. టీడీపీ నాయకుడు మోహన్ రెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి, పసుపల మహమ్మద్, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

ముమ్మరంగా వరి కోతలు

- జిల్లాలో 73,038 హెక్టార్లలో వరి సాగు
- తగ్గిన దిగుబడులు.. గిట్టుబాటు లేని ధరలు



వరి పంటను కోస్తున్న యంత్రం

కొలిమిగుండ్ల, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వరి కోతలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఖరీఫ్‌లో రైతులు బోరు బావులు, కాలువలు, చెరువులు, రిజర్వాయర్ల కింద విస్తారంగా సాగు చేసిన వరి నూర్పిడి దశకు చేరుకోవడంతో పక్షం రోజులుగా వరి కోతలు ప్రారంభమయ్యాయి. కాగా ఈ ఏడాది జిల్లాలో భారీ వర్షాలు కురిసి నీరు పుష్కలంగా లభించడంతో గ్రామీణ ప్రాంతాల్లో సైతం రైతులు ఖరీఫ్‌లో పెద్ద ఎత్తున వరి సాగుచేశారు. ఈ పరిస్థితుల్లో అన్నదాతలు వరిపై భారీ ఆశలు పెంచుకున్నారు. నంద్యాల జిల్లాలో వరి సాధారణ సాగు విస్తీర్ణం 65,255 హెక్టార్లు కాగా, రైతులు 73,038 హెక్టార్లలో వరి సాధారణ సాగుకు మించి సాగుచేశారు. ప్రస్తుతం వరి కోతలతో పొలాల్లో సందడి నెలకొంది.

తగ్గిన దిగుబడులు

అయితే వరి సాగు తర్వాత జిల్లాలో అనేక మార్లు సంభవించిన పకృతి వైపరీత్యాలు, తుఫాన్లు కారణంగా వరి దిగుబడి భారీగా తగ్గినట్లు అన్నదాతలు పేర్కొంటున్నారు. గతంలో ఎకరాకు 40 నుంచి 50బస్తాలు వచ్చే దిగుబడి వచ్చేందని, ఈ ఏడాది 30 నుంచి 35 బస్తాల లోపే ఉందని రైతులు వాపోతున్నారు. విత్తనాలు, వరి నార, నాట్లు, రసాయన ఎరువులు, కలుపు తీత, మందుల పిచికారి, వరి కోతలు ఇలా అన్నీ కలుపుకొని రూ.40వేలు పెట్టుబడులు పెట్టినట్లు రైతులు పేర్కొంటున్నారు. ప్రస్తుత దిగుబడులతో రైతులకు ఏమాత్రం లాభాలు చేకూరే పరిస్థితి లేదని వారు లబోదిబోమంటున్నారు. మరోవైపు గతంలో వరి బస్తా రూ.2000 నుంచి రూ.2200 వరకు పలకగా ప్రస్తుతం వరి ధర భారీగా తగ్గినట్లు రైతులు వాపోతున్నారు. బస్తా వరి రూ.1400 నుంచి రూ.1500కు మించి పలకడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గిట్టుబాటు కాని ధరలతో వరి రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి నెలకొంది. మరోవైపు దళారులు సైతం వరి రైతులను ముంచుతున్నారు. బనగానపల్లె నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో వ్యాపారులు సిండికెట్‌గా మారి రైతులను దోచుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి: ఎమ్మెల్యే కోట్ల





టీడీపీ నాయకులతో మాట్లాడుతున్న కోట్ల, ఎమ్మెల్యేకు పూల మొక్క అందజేస్తున్న ప్రిన్సిపాల్

డోన్ టౌన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో టీడీపీ నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే కోట్ల మాట్లాడుతూ ప్రజలు ఏ సమస్య వచ్చి నా నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువ చేసే బాధ్యత మీదేనని నాయకులను సూచించారు. నాయకులు లక్కసాగరం లక్ష్మీ రెడ్డి, బేతంచెర్ల పట్టణ, మండల అధ్యక్షులు బుగ్గన ప్రసన్నలక్ష్మి, ఎల్ల నాగయ్య పాల్గొన్నారు.

- **పాఠశాలలో బోరు ఏర్పాటు చేయించండి**

స్థానిక మహాత్మా జ్యోతిరావు గురుకుల పాఠశాలలో కొత్త బోరు ఏర్పాటు చేయించి, తాగునీటి సమస్యను పరిష్కరించాలని ప్రిన్సిపాల్ సంగీత కుమారి ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డిని కోరారు. సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇటీవల నూత నంగా విధుల్లో చేరిన ప్రిన్సిపాల్ ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పూలమొ క్కను అందజేశారు. అనంతరం పాఠశాలలో 700 మందికి పైగా విద్యార్థినులు చదువుకుంటున్నారని, తాగు నీరు లేక ఇబ్బంది పడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే త్వరలో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

- **ఎమ్మెల్యేను కలిసిన ఆర్టీసీ డీఎం:** డోన్ ఆర్టీసీ డీఎంగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఎంవీ చలపతి సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే కోట్ల నివాసంలో పుష్పగుచ్చం అందించి మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే కోట్ల మాట్లాడుతూ ఆర్టీసీ బస్సు లను సమయ పాలనను పాటించి ప్రయాణికులను వారి గమ్యాలకు సురక్షితంగా చేర్చాలని అన్నారు. ఆర్టీసీ బస్సులు ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్ర త్తలు తీసుకోవాలని సూచించారు.
- **ఎమ్మెల్యేకు ఆహ్వానం:** నంద్యాలలో ఈ నెల 13న బీజేపీ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహ ప్రతిష్ఠకు రావాలని డోన్ బీజేపీ నాయకులు ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డిని ఆహ్వా నించారు. సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీజేపీ నాయకులు సంధు వెంకట రమణ, ఒంటెద్దు కిరణ్, కమలేష్, బంకు రవి, ఆర్మీ రామయ్యలు కలిసి ఆహ్వానించారు.

ఆరుతడి సరే.. వరికి నీరివ్వరా?

(5వ పేజీ తరువాయి)

తెలుగుగంగ ఆయకట్టు భూముల్లో ఇప్పటికే నారు మళ్లు సాగు చేశారు. ఖరీఫ్‌లో నష్టపోయాం, రబీలో గట్టెక్కాలన్న ఆలోచనతో సాగు చేశారు. ఖరీఫ్‌లో రైతులు ప్రకృతి దాడి చేయడంతో పెట్టుబడులు చేతికందని పరిస్థితి నెలకొంది. ఇలాగైతే వ్యవసాయానికి స్వస్తి పలకాలనే యోచనలో ఉన్నామని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

సాగునీరందించి ఆదుకోండి



తెలుగుగంగ ప్రధాన కాల్వకు రబీ సీజన్‌లో సాగునీరు అందించి ఆదుకోవాలి. ఖరీఫ్ సీజనులో వరి, మొక్కజొన్న పంటలు కోల్పోయాం. రబీలో సాగునీరు అందిస్తే సాగు చేసుకుని అప్పుల ఊబి నుంచి బయట పడతాం.

\- దస్తగిరి

దిగుబడి తగ్గింది



వరి, మొక్కజొన్న దిగుబడి ఖరీఫ్‌లో తగ్గింది. గంగ కాల్వకు సాగునీరు అందిస్తే రబీలో పంటలు సాగు చేసుకుని ఊపిరి పీల్చుకుంటాం. ఖరీఫ్‌లో పెట్టుబడి అంతా పుడమి పాలైంది. రబీలో పంటలు సాగు చేసి గట్టెక్కే ఆశ లో ఉన్నాం.

\- నాగిరెడ్డి, రైతు, డి. కొట్టాల

తీవ్రంగా నష్టపోయాం



ఐదెకరాలు కౌలుకు తీసుకుని వరి, మినుము, మొక్కజొన్న ఖరీఫ్‌లో సాగు చేశా. పెట్టుబడి కూడా చేతికందని పరిస్థితి నెలకొంది. నీరందిస్తే పంటలు సాగు చేసుకుని అప్పుల నుంచి బయటపడతాం.

మాబుసాని, కౌలు రైతు, కొండమాయపల్లె

సాగు చేసుకోలేని భూమి మాటేంటి



ఆరుతడి పంటలు సాగు చేసుకోలేని భూముల మాటేంటి? వరి పంట తప్ప మిగలిన పంటలు సాగు చేయడానికి వీలు కాని భూములున్నాయి. ఆ రైతులు ఏ పంట సాగు చేసుకోవాలో అధికారులే చెప్పాలి. సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలి.

\- నరసింహులు, రైతు సంఘం నాయకుడు, రుద్రవరం మండలం

2026 మార్చి 31 వరకు సాగునీరందిస్తాం

2026 మార్చి 31 వరకు వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయరు నుంచి తెలుగుగంగ ప్రధాన కాల్వకు (చెన్నై కాల్వ)కు నీరు సరఫరా చేస్తాం. రైతులు ఆరుతడి పంటలు సాగు చేసుకొని సహకరించాలి.

\- ప్రతాప్, ఇన్‌చార్జి ఎస్ఈ, తెలుగుగంగ ప్రాజెక్టు

ప్యాపిలి అదనపు ఎస్ఐగా దాదాపీర్

ప్యాపిలి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్యాపిలి అదనపు ఎస్ఐగా దాదాపీర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. నంద్యాల ఎస్పీ కార్యాలయంలో వీఆర్‌లో ఉన్న ఆయనను ప్రభుత్వం ఇక్కడ నియమించింది. ఈ సందర్భంగా దాదాపీర్ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుంటా చర్యలు తీసుకుంటామన్నారు.

14 వరకు హస్త కళల వారోత్సవాలు



రాష్ట్రపతి అవార్డు గ్రహీత, కలంకారీ చిత్రకారుడు శివప్రసాద రెడ్డిని సత్కరిస్తున్న లేపాక్షి మేనేజర్ తిమ్మయ్య

కర్నూలు కల్చరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఈనెల 14 వరకు జాతీయ హస్తకళల వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు లేపాక్షి ఎంపోరియం మేనేజర్ బి. తిమ్మయ్య అన్నారు. రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నామన్నారు. సోమవారం పెద్దపోస్టాఫీసు ఎదురుగా గల లేపాక్షి ఎంపోరియంలో కలంకారీ చిత్రకారుడు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత, బనగానపల్లెకు చెందిన కె.శివప్రసాద రెడ్డిని సన్మానించారు. ఎంపోరియంలో అన్ని రకాల హస్తకళల వస్తువులు 10 నుంచి 20 శాతం తగ్గింపు ధరల్లో లభిస్తాయన్నారు. ఉద్యోగులు దివ్య, కిషోర్ పాల్గొన్నారు.

ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలి

చాగలమర్రి, డిసెంబరురు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులు రబీలో ఆరుతడి పంటలు మాత్రమే సాగు చేసుకోవాలని టీజీపీ డీఈ వెంకటరమణ సూచించారు. సోమవారం స్థానిక టీజీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ టీజీపీ కాలువలో 800 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోందని అన్నారు. కడప జిల్లాలోని బ్రహ్మసాగర్‌కు 32 టీఎంసీల నీటిని సరఫరా చేశామన్నారు. వీబీఆర్‌లో 16 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు. టీజీపీ కాలువ ద్వారా మార్చి చివరి వరకు సాగు నీరు అందిస్తామన్నారు.

హోరాహోరీగా వాలీబాల్ పోటీలు

చాగలమర్రి, డిసెంబరురు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో ఎస్పీజీ చర్చి వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన వాలీబాల్, సెటిల్, బ్యాట్మింటన్ పోటీలు హోరాహోరీగా సాగాయి. వాలీబాల్ పోటీల్లో చాగలమర్రి జట్టు మొదటి స్థానం, ముత్యాలపాడు జట్టు రెండో స్థానంలో నిలిచాయి. సెటిల్ పోటీల్లో ఆళ్లగడ్డ మొదటి స్థానం, యర్రగుంట్ల రెండో స్థానం, చాగలమర్రి మూడో స్థానం, బైబిల్ పరీక్షల్లో గొడిగనూరుకు చెందిన కీర్తి మొదటి స్థానం, చాగలమర్రికి చెం దిన సార, గొడిగనూరుకు చెందిన సునిల్ మూడో స్థానంలో రాణిం చారు. గెలుపొందిన క్రీడాకారులకు దాతలు నగదు బహుమతులు అందజేస్తారని డీనరీ చైర్మన్ చంద్రశేఖర్, నిర్వాహకులు డేవిడ్ పేర్కొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

డోన్ రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజోతి): అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల సమస్యలు పరిష్కరించాలని అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జులేఖ డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 12న డోన్ ఆర్డీవో కార్యాలయం ఎదుట చేపట్టే ఆందోళనను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ఇంటి స్థలాల పేరుతో మోసం చేస్తే చర్యలు

కొలిమిగుండ్ల, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఇంటి స్థలాల పేరుతో ప్రజలను మోసం చేస్తే చర్యలు తీసుకుంటామని కొలిమిగుండ్ల సీఐ మద్దినేని రమేష్‌బాబు హెచ్చరించారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల కొందరు దళారులు ప్రజల నుంచి డబ్బులు తీసుకొని ప్రభుత్వ స్థలాలు చూపిస్తున్నట్లు ఫిర్యాదులు తమ దృష్టికి వచ్చినట్లు సీఐ వివరించారు. దళారులను నమ్మి ప్రజలు మోసపోద్దని సీఐ సూచించారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా చంద్రశేఖర్ రెడ్డి

సంజామల, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఫీల్డ్ అసిస్టెంట్ల రాష్ట్ర యూనియన్ సంయుక్త కార్యదర్శిగా సంజామల మండలం నట్లకొత్తూరు గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ యాతం చంద్రశేఖర్ రెడ్డిని ఎన్నుకున్నారు. సోమవారం అమరావతిలో జరిగిన ఫీల్డ్ అసిస్టెంట్ల రాష్ట్ర యూనియన్‌లో ఈయనకు స్థానం లభించింది. ఈ సందర్భంగా మండల ఫీల్డ్ అసిస్టెంట్లు చంద్రశేఖర్ రెడ్డిని అభినందించారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



కోవెలకుంట్లలో ధర్నా చేస్తున్న ఉద్యోగులు

డోన్ రూరల్, డిసెంబరు 8(ఆంధ్రజోతి): సహకార పరపతి సంఘం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ వ్యవసాయ సహకార పరపతి సంఘం సమైఖ్య జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు. సోమవారం డోన్ పట్టణంలోని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు డోన్ బ్రాంచ్ కార్యాలయం వద్ద సహకార పరపతి సంఘాల సీఈవోలు, సిబ్బంది ఆందోళన చేశారు. వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ జీవో.36ను వెంటనే అమలు చేయలని, 2019-2024 కాలపు పెండింగ్‌లో ఉన్న వేతన సవరణలు చేసి, అప్పటివరకు మధ్యంతర భృతిని చెల్లించాలని కోరారు. అనంతరం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు డోన్ బ్రాంచ్ మేనేజర్ లక్ష్మీనారాయణకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో డోన్, ప్యాపిలి, హుసేనాపురం, బేతంచెర్ల, వెల్దుర్తి, క్రిష్ణగిరి, కోవెలకుంట్ల సహకార పరపతి సంఘాల సీఈవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: తమ సమస్యలను పరిష్కరించాలని సహకార పరపతి సంఘం ఉద్యోగులు డిమాండ్ చేశారు. సోమవారం కోవెలకుంట్ల పట్టణంలోని డీసీసీబీ కార్యాలయం ముందు ఉద్యోగులు ధర్నా చేశారు. వీరి ధర్నాకు బ్యాంకు చీఫ్ మేనేజర్ అమర్నా నాథరెడ్డి, సిబ్బంది ప్రతాపరెడ్డి, రామసుబ్బయ్య, ఇస్మాయిల్ మద్దతు తెలియజేశారు.

పశుగ్రాసానికి 'అనంత' గిరాకీ

- పెరిగిన గడ్డి ధర
- ఒక్కో ట్రాక్టర్ రూ.15వేలు
- పదుల సంఖ్యలో అనంతపురానికి తరలివెళ్తున్న ట్రాక్టర్లు



అనంతపురం జిల్లాకు తరలివెళ్తున్న వరి గడ్డి ట్రాక్టర్లు

కొలిమిగుండ్ల, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కరువు జిల్లాగా పేరు గాంచిన అనంతపురం జిల్లాలో గ్రాసం కొరత నెలకొంది. నిత్యం పదుల సంఖ్యలో నంద్యాల జిల్లా నుంచి పశుగ్రాసం భారీగా తరలి వెళుతోంది. దీంతో గ్రాసానికి గిరాకీ ఏర్పడింది. జిల్లాలోని అవుకు, బనగానపల్లె, కోవెలకుంట్ల తదితర ప్రాంతాల నుంచి ప్రతి రోజూ ట్రాక్టర్లలో వరి గడ్డిని అనంతపురానికి తరలిస్తున్నారు. గతంలో రూ.7, 8వేలు ఉన్న ట్రాక్టరు గడ్డి ధర ప్రస్తుతం రూ.15వేలకు చేరింది.

హిందూ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలి

డోన్ టౌన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): డోన్ పట్టణంలో ఈనెల 14న జరగనున్న హిందూ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని సమితి నాయకులు సుదర్శన్, గంగాధర్, శ్రీనివాసులు, హరి, తిరుపాలు పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని వెంకటాచలం ఫంక్షన్ హాలులో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈసమ్మేళనానికి ప్రజలంతా పాల్గొనాలని కోరారు. సమావేశంలో బీజేపీ నాయకులు సంధు వెంకటరమణ, హేమసుందర్ రెడ్డి, నటరాజ్, జగన్మోహన్, తిమ్మారెడ్డి, శంకర్ రెడ్డి పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారం

రుద్రవరం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని తువ్వపల్లె గ్రామంలో డ్రైనేజీ సమస్యను సోమవారం పరిష్కరించినట్లు డిప్యూటీ ఎంపీడీవో ప్రసాద్‌రెడ్డి, ఇన్‌చార్జి ఈవో రామకృష్ణ తెలిపారు. గత కొంత కాలం నుంచి డ్రైనేజీ సమస్య ఉందన్నారు. ఎక్స్‌కవేటర్ సాయంతో డ్రైనేజీ సమస్యను పరిష్కరించినట్లు వారు తెలిపారు.

నేడు పశువైద్య శిబిరం

సంజామల, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని గిద్దలూరు గ్రామంలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు వెటర్నరీ ఏడీ కొండారెడ్డి తెలిపారు. ఈ శిబిరంలో గర్భకోశ వ్యాధులు, చికిత్సలు చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఇంటి పన్ను వసూళ్లను వేగవంతం చేయండి

కొలిమిగుండ్ల, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శులు ఇంటి పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని డిప్యూటీ ఎంపీడీవో చంద్రమౌళీశ్వరగౌడ్ ఆదేశించారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం లో ఇంటి పన్ను వసూలు అంశంపై పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించారు. ఇంటి పన్ను యజమానులు ఆన్‌లైన్ ద్వారా చెల్లించవచ్చన్నారు. పంచాయతీ కార్యదర్శులు రాఘవరెడ్డి, వెంకట సుబ్బయ్య, ఉదయ్ పాల్గొన్నారు.

వసుధ ఫౌండేషన్ సేవలు ఎనలేనివి



మాట్లాడుతున్న టంగుటూరు శ్రీనయ్య

బనగానపల్లె, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): వసుధ ఫౌండేషన్ సేవలు ఎనలేనివని కో-ఆర్డినేటర్ టంగుటూరు శ్రీనయ్య అన్నారు. సోమవారం బనగానపల్లె పట్టణానికి చెందిన దూదేకుల మహమ్మద్ అనే యువకుడు కొండపేట అమ్మవారిశాలలో పనిచేసేవాడు. దీపావళి సందర్భంగా టపాసులు పేలి అతడి ఒళ్లంతా కాలిపోయింది. ఆర్యవైశ్యులు గాయపడ్డ అతడిని కర్నూలు వైద్యశాలకు తరలించి చికిత్స చేయించి ప్రాణాలను కాపాడారు. బాధితుడికి ఫౌండేషన్ తరపున కో-ఆర్డినేటర్ టంగుటూరు శ్రీనయ్య రూ.15వేల చెక్కును, అలాగే ఆర్యవైశ్యులు రూ.15వేలు విలువ చేసే సరుకులను సోమవారం పంపిణీ చేశారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు పీఎస్ఎస్ నారాయణ, గాదంశెట్టి వేణుగోపాల్, నూకల సుబ్బయ్య, సత్యం, శివయ్య, జంగంశెట్టి, శరత్, జక్కాశ్రవన్, మల్లారెడ్డి పాల్గొన్నారు.

బీసీ రాజారెడ్డిని కలిసిన ఆర్టీసీ డీఎం

బనగానపల్లె, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): బనగానపల్లె నూతన ఆర్టీసీ డీఎంగా శశిభూషణ్‌ను నియమించారు. ఈమేరకు బాధ్యతలు స్వీకరించిన ఆయన బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజా రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆర్టీసీ సంస్థ పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచాలని, ప్రయాణికులకు మెరుగైన సేవలందించాలని బీసీ రాజారెడ్డి కోరారు. కార్యక్రమంలో బనగానపల్లె మార్కెట్‌యార్డు చైర్మన్ కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

'ఇది రైతు వ్యతిరేక బిల్లు'

డోన్ రూరల్, డిసెంబరు 8(ఆంధ్రజోతి): కేంద్ర ప్రభుత్వం పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో విద్యుత్ బిల్లు, విత్తన బిల్లును ఆమోదించేందుకు ప్రతిపాదనలు తీసుకురావడం దారుణమని రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామచంద్రుడు, ఉపాధ్యక్షులు సుబ్బరాయుడు ఆరోపించారు. రైతు వ్యతిరేక బిల్లును నిరసిస్తూ బిల్లుకు సంబంధించిన ప్రతులను సోమవారం బేతంచెర్ల రోడ్డులో మంటల్లో వేసి దహనం చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం, సీఐటీయూ నాయకులు నాగమద్దయ్య, కొండయ్య, భాస్కర్ రెడ్డి, శివరామ్, మాణిక్యంశెట్టి, నక్కి శ్రీకాంత్ పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

బనగానపల్లె, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలో జమాతే ఇస్లామిహింద్ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేత లకు సంస్థ బనగానపల్లె అధ్యక్షుడు గౌస్ బాషా ఆధ్వర్యంలో సోమవా రం బహుమతులు అందించారు. మొత్తం 400 మంది విద్యార్థులు వ్యాసరచన పోటీల్లో పాల్గొనగా ప్రథమ బహుమతిగా ప్రియదర్శిని స్కూల్‌కు చెందిన శివసాయిలీల, ద్వితీయ బహుమతి డాల్ఫిన్ స్కూల్‌కు చెందిన రుబీనా, మూడో బహుమతి ఎస్వీ చైతన్య స్కూల్‌కు చెందిన రుబీనాలు గెలుపొందారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు రఫీ, తదితరులు పాల్గొన్నారు.